CLASS - 6

LANGUAGES SEMESTER - 1

S. No.	SUBJECT	Page No.
1.	తెలుగు – తెలుగు సౌరభం	01-66
2.	हिंदी – मंजरी	67-162
3.	ENGLISH – SPRING BLOOM	163-241

© Government of Andhra Pradesh, Amaravati

Telugu, Hindi First Published 2020
New Impression - 2021, 2022, 2023, 2024, 2025, 2026
English First Published 2023
New Impression - 2024, 2025, 2026

DISCLAIMER

Any form of copying of the content, information and illustrations from this textbook is a punishable offence.

All rights reserved

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published. Without a similar condition including this condition being imposed on the subsequent purchaser. The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 GSM, SS Maplitho, Title Page 220 GSM, and White Art Card.

Published by Samagra Shiksha & SCERT - Government of Andhra Pradesh, Amaravati.

APSCERT

మా తెలుగు తల్లి

– శంకరంబాడి సుందరాచారి



మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

AP SCERT

Printed in India
at the A.P. Govt., Textbook Press,
Amaravati, Andhra Pradesh.

వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ



వందే మాతరం వందే మాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలాం

సస్యశ్యామలాం మాతరం వందే మాతరం

శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం

ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం

సుహాసినీం సుమధుర భాషిణీం

సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

Vande Mataram

Vande Mataram!

Sujalam, suphalam, malayaja shitalam,

Shasyashyamalam, Mataram!

Vande Mataram!

Shubhrajyotsna pulakitayaminim,

Phullakusumita drumadala shobhinim,

Suhasinim sumadhura bhashinim,


Sukhadam varadam, Mataram!

Vande Mataram, Vande Mataram!

- Bankimchandra Chatterji

AP SCERT

జాతీయ జెండా రూపకర్త



పింగళి వెంకయ్యగారు 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లాలోని భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశానికి తగిన జాతీయ జెండా అవసరాన్ని గుర్తించిన పింగళి వెంకయ్య గారు అనేక నమూనాలను రూపొందించారు. 1921లో విజయవాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మహాత్మాగాంధీకి ఆయన జెండా నమూనాను సమర్పించారు. గాంధీజీ సూచనల మేరకు జెండాలో మార్పులు చేసి, త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు.

Our National Anthem | జాతీయ గీతం

Jana-gana-mana-adhinayaka jaya he
Bharata-bhagya-vidhata
Panjaba-Sindhu-Gujarata-Maratha
Dravida-Utkala-Banga
Vindhya-Himachala-Yamuna-Ganga
uchchala-jaladhi-taranga
Tava Subha name jage,
tava subha asisa mage,
gahe tava jaya-gatha.
Jana-gana-mangala-dayaka jaya he
Bharata-bhagya-vidhata.
Jaya he, Jaya he, Jaya he,
jaya jaya jaya jaya he.

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్చల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాంగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

- Rabindranath Tagore

– రవీంద్రనాథ్ ఠాగూర్

Pledge | ప్రతిజ్ఞ

India is my country. All Indians are my brothers and sisters.
I love my country and I am proud of its rich and varied heritage.
I shall always strive to be worthy of it.
I shall give my parents, teachers and all elders respect,
and treat everyone with courtesy. I shall be kind to animals.
To my country and my people, I pledge my devotion.
In their well-being and prosperity alone lies my happiness.

- Pydimarri Venkata Subba Rao

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

– పైడిమర్రి వెంకట సుబ్బారావు

AP SCERT

జాతీయ విద్యా విధానం 2020

జాతీయ విద్యా విధానం 2020 సమగ్రమైనది, సౌలభ్యమైనది మరియు విద్యార్థి-కేంద్రీకృత విద్యా వ్యవస్థను నిర్మిస్తుంది. ఇది సామర్థ్యాధారిత అభ్యసనం మరియు అనుభవాత్మక విధానాలను బలంగా నొక్కి చెబుతుంది, దీనివల్ల విద్య ఆకర్షణీయంగా మరియు అర్థవంతంగా ఉంటుంది.

జాతీయ విద్యా విధానం 2020 ప్రస్తుత 21వ శతాబ్దపు నైపుణ్యాలపై దృష్టి సారిస్తుంది.

- విమర్శనాత్మక ఆలోచన
- సృజనాత్మకత
- సమాచారం
- సమస్య పరిష్కారం ముఖ్యమైనవి.

ఇది నిజ జీవిత అభ్యసనం ఆవిష్కరణలు, సాంకేతికతాధారిత బోధనా విధానాలను ప్రోత్సహిస్తుంది. స్థూలంగా, ఈ విధానం సమ్మిళిత విద్యను మరియు భవిష్యత్తుకు సిద్ధమైన విద్యా వ్యవస్థ నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది వేగంగా మారుతున్న ప్రపంచంలో ప్రతి విద్యార్థి విజయవంతం కావడాన్ని శక్తివంతం చేస్తుంది. ఇది భారతదేశ విద్యా రంగంలో ఒక పెద్ద మార్పు తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తోంది.

राष्ट्रीय शिक्षा नीति 2020 (NEP 2020)

राष्ट्रीय शिक्षा नीति 2020 एक समग्र लचीली और विद्यार्थी केंद्रित शिक्षा प्रणाली की परिकल्पना करती है। यह क्षमता - आधारित अधिगम(Competency - based learning) और अनुभवात्मक दृष्टिकोण पर जोर देती है, जिस से शिक्षा अर्थपूर्ण और रोचक बनती है। NEP 2020 में 21 वीं सदी के कौशलों जैसे अलोचनात्मक सोच (Critical Thinking), सृजनात्मकता (Creativity), संप्रेषण कौशल (Communication Skill) और समस्या समाधान कौशल (Problem Solving Skill) के महत्व को प्रमुख रूप से रेखांकित किया गया है।

यह वास्तविक जीवन से जुड़े अधिगम, नवाचार और प्रौद्योगिकी - सक्षम शिक्षण पद्धतियों के समन्वय को प्रोत्साहित करती है। कुल मिलाकर, यह नीति एक ऐसी समावेशी और भविष्य के लिए तैयार शिक्षा प्रणाली के निर्माण का लक्ष्य रखती है, जो तेजी से बदलती दुनिया में प्रत्येक शिक्षार्थि को सफल होने के लिए सशक्त बनाती है।

The National Education Policy 2020 (NEP 2020)

The National Education Policy 2020 (NEP 2020) envisions a holistic, flexible, and learner-centred education system. It emphasizes competency-based learning and experiential approaches that make education meaningful and engaging. NEP 2020 highlights the importance of 21st-century skills such as critical thinking, creativity, communication, and problem-solving. It encourages the integration of real-life learning, innovation, and technology-enabled pedagogies. Overall, the policy aims to build an inclusive and future-ready education system that empowers every learner to thrive in a rapidly changing world.

AP SCERT

సాధించాల్సిన సామర్థ్యాలు

1. అవగాహన ప్రతిస్పందన :

విన్న, చూసిన, చదివిన వాటిని అర్థం చేసుకొని ప్రతిస్పందించడం :

పిల్లలు తమ స్థాయికి తగిన ముద్రిత, అముద్రిత అంశాలలోగల పరిచిత, అపరిచిత గేయాలు, కథలు, సంభాషణలు, ఉపన్యాసాలు, చర్చలు వంటివి శ్రద్ధగా విని అర్థంచేసుకొని వాటితో తమ పూర్వజ్ఞానంతో మేళవించుకోగలగాలి. అడిగిన ప్రశ్నలకు సరైనరీతిలో క్రమపద్ధతిలో జవాబులు చెప్పగలగాలి.

2. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

విన్న, చూసిన, చదివిన విషయాలను సొంతమాటల్లో రాయడం.

పాఠ్యాంశాలలోని, అభ్యాసాలలోని అంశాలకు విషయాలను సొంతమాటల్లో సంక్షిప్తీకరించటం, విశదీకరించటం, వివరించడం, తాత్పర్యాలు, సారాంశాలు రాయడం పాత్రలస్వభావాలు, సంఘటనలు, కవులు, రచయితలగురించి సొంతమాటల్లో రాయడం. రాసేటప్పుడు - అక్షర దోషాలు లేకుండా, క్రమపద్ధతిలో విరామ చిహ్నాలు ఉపయోగించి సొంతంగా రాయడం.

స్వీయ అనుభవాలను సృజనాత్మకంగా వ్యక్తపరచడం.

అ) ప్రక్రియను ఒక రూపం నుంచి మరొకరూపంలోకి మార్చడం, సమీక్షలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు, కరపత్రాలు, నివేదికలు రాయడం, దరఖాస్తులు రాయడం, ఆత్మకథలు రాయడం, నాటకీకరణ, నినాదాలు, భాషాసంఘాలు ఏర్పాటుచేయడం, సాహిత్యసమావేశాలు నిర్వహించడం.

ఆ) ఇతరుల సంస్కృతి సంప్రదాయాలు, పండుగలు, ఆచార వ్యవహారాలపట్ల (అన్ని అంశాలలో) సహానుభూతి కలిగి ఉండటం. కవులు, వారి రచనలు ప్రశంసించడం, వివిధ సాహితీ ప్రక్రియలను చదవటం, ఆనందానుభూతి, రసానుభూతి పొంది, కవులను, పాఠంలోని మంచి విషయాలను ప్రశంసించడం.

ఇ) ప్రత్యేక అవసరాలు గల పిల్లల/బాలికలు పట్ల సహానుభూతి కలిగిఉండి, సహాయసహకారాలు అందించడం.

3. భాషాంశాలు (పదజాలం వ్యాకరణాంశాలు) :

పద స్వరూప స్వభావాలను తెలుసుకోవడం, తార్కికశక్తిని, దోషరహిత భావప్రకటన సామర్థ్యాన్ని పెంపొందించడం.

అ) భాషాబోధనలో పిల్లల్లో సుసంపన్నమైన పదజాలాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వడం. పదాలకు అర్థాలకు నిఘంటువును వినియోగించడం, వ్యతిరేక పదాలు, ప్రకృతి-వికృతి, జాతీయాలు వంటి వాటిని అర్థంచేసుకుని నిత్యజీవితంలో సందర్భోచితంగా ఉపయోగించటం.

ఆ) విద్యార్థి భాషాభాగాలు, విభక్తులు పదాలను కలపడం, విడదీయడం మొదలైనవి చేస్తున్నప్పుడు జరిగే మార్పులను గుర్తించడం, సంధులను సూత్రీకరించటం, పదాలలో ఉండే సమాసాలను గుర్తించగలగటం.

ఇ) సాహిత్యంలో ఉన్న వివిధ ప్రక్రియల యొక్క స్వరూప, స్వభావాలను గుర్తించగలగటం, సొంతంగా రాయగలగడం.

ఈ) వాక్యనిర్మాణం, వాక్యంలోని అంతర్భాగాలను, వాక్యాలలోని రకాలను గ్రహించగలగడం.

ఉ) వ్యాకరణాంశాలలో వర్ణమాలలోని అచ్చులు, హల్లులు, ఉభయాక్షరాలు, భాషాభాగాలు, కర్త, కర్మ, క్రియలు మొదలైన భాషకు సంబంధించిన ప్రాథమిక అంశాలను తెలుసుకోవడం ద్వారా భాషపై అధికారాన్ని సంపాదించడం.

AP SCERT

తెలుగు సౌరభం - 6

ఆరవ తరగతి (ప్రథమ భాష)

సెమిస్టర్ - 1

విషయసూచిక

క్ర.సం.	పాఠం	ప్రక్రియ	ఇతివృత్తం	కవి / రచయిత	మాసం	పుట
	సంసిద్ధత కార్యక్రమం (సంసిద్ధత కార్యాచరణ పుస్తకం చూడండి)				జూన్-జూలై	
	పాఠ్యప్రణాళిక లక్ష్యాలు					2
1.	అమ్మఒడి	గేయం	తల్లిప్రేమ	బి.వి.నరసింహారావు	ఆగస్టు	3
2.	తృప్తి	కథానిక	మానవ విలువలు	సత్యం శంకరమంచి	ఆగస్టు / సెప్టెంబర్	13
3.	మాకొద్దీ తెల్లదొరతనం	గేయం	దేశభక్తి	గరిమెళ్ల సత్యనారాయణ	సెప్టెంబర్	25
4.	సమయస్ఫూర్తి	కథ	సమయస్ఫూర్తి	కందుకూరి వీరేశలింగం	సెప్టెంబర్	34
5.	సుభాషితాలు	శతక పద్యాలు	నైతికవిలువలు	శతక కవులు	అక్టోబర్	46
6.	మన మహనీయులు (ఉపవాచకం) i) అమరజీవి పొట్టి శ్రీరాములు ii)పింగళి వెంకయ్య iii)పైడిమర్రి వెంకట సుబ్బారావు iv)శంకరంబాడి సుందరాచారి	వ్యాసం	దేశభక్తి	రచయితల బృందం	 సెప్టెంబర్ సెప్టెంబర్ అక్టోబర్ అక్టోబర్	56
	పదవిజ్ఞానం					62
	భావనాపటం					66

M5Q7N9

Teacher Corner

Q5N2Z6

Student Corner

సంస్కృతం కాంపోజిట్ కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలను చదవాలి.

APSCERT

పాఠ్య ప్రణాళిక లక్ష్యాలు

పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1 :

- వివరణ, విశ్లేషణ ప్రతిస్పందనల కోసం భాషానైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- ముఖ్యాంశాలను గుర్తించి, సంక్షిప్తంగా వివరించడం.
- తగిన భాషతో సందర్భానికి తగిన ప్రశ్నలను చదివి అవగాహన చేసుకోవడం.
- వివిధ రకాల లేఖలు, వ్యాసాలు, నివేదికల గురించి తెలుసుకుని చదవడం.
- అవసరానికి తగిన విధంగా ఆడియో, వీడియో, పోస్టర్ వంటి ముద్రిత రూపాలు గుర్తించి తెలుసుకోవడం.

పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2 :

- సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని అన్వేషణ ద్వారా అభినందించడం.
- కథలు, గేయాలు, కవిత్వాలు, నాటకాలు వంటి ప్రక్రియల శైలులను గుర్తించి, అభినందించడం.
- భిన్నమైన సామాజిక, సాంస్కృతిక కోణాలలో భావాలు వ్యక్తపరచడం.

పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3 :

- భాషా నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను వినియోగించడం.
- విరామ చిహ్నాలు, భాషాభాగాలు, లింగం, వచనం, కాలం, వాక్య నిర్మాణం అవగాహనతో వినియోగించడం

పాఠ్య ప్రణాళికా లక్ష్యం-4 :

- కథలు, పుస్తకాలపై సమీక్ష చేయడం, గ్రంథాలయ సద్వినియోగం.
- సాహిత్యంలోని అన్ని ప్రక్రియలు చదివి సమీక్ష చేయడం.
- ప్రాజెక్టులు, మరియు నివేదికలు వంటి కార్యకలాపాలకు గ్రంథాలయాన్ని ఉపయోగించడం.

పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5 :

- భాష యొక్క ప్రత్యేక లక్షణాలను గుర్తించి, అభినందించడం మరియు వినియోగించడం.
- పదాలకు అర్థాలు, సమానార్థక పదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతులు అర్థం చేసుకుని వినియోగించడం.
- భాషలో ఉన్న అక్షరాలు, స్వరాలు ఉచ్చారణ, పారిభాషిక పదాలు అర్థం చేసుకోవడం, అభినందించడం.
- పద ప్రయోగాలు, అనుప్రాసలు పూరించడం, రూపొందించడం.
- పదక్రీడలు, వాక్య పూరణలు, అంత్యాక్షరి పూరించడం, రూపొందించడం.
- సమాసం, సంధి, క్రియ రూపాలు అర్థం చేసుకోవడం, వినియోగించడం.

AP SCERT

1. అమ్మఒడి

అభ్యసన ఫలితాలు :

1. గేయకవుల గురించి తెలుసుకొని, పాఠ్యభాగ కవిని గురించి వివరిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
2. అమ్మ ప్రేమను, గొప్పతనాన్ని సొంత మాటల్లో చెప్పగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
3. అమ్మఒడి గేయాన్ని పాడి వివిధ శైలులను గుర్తించి అభినందించగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2)
4. అమ్మ / నాన్న / సంరక్షకుల గొప్పతనాన్ని రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3)
5. అచ్చులు, హల్లులు, వాటిలోని రకాలు గుర్తిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)
6. గేయంలోని ప్రాసపదాలు గుర్తించి చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)



వినడం - ఆలోచించి మాట్లాడడం

1. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. అమ్మ పిల్లలకు ఏమి చెబుతుంది?
3. అమ్మ పిల్లల కోసం ఏమేమి చేస్తుంది?

ఉద్దేశం: అమ్మ ప్రేమను, గొప్పతనాన్ని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

కవి పరిచయం

బాడిగ వెంకట నరసింహారావు

(15.8.1913 - 6.1.1994)




కృష్ణా జిల్లాలోని కవుతరంలో జన్మించారు. 'బాలరసాలు', 'పాలబడి పాటలు', 'ఆవు-హరిశ్చంద్ర', 'బాలతనం', 'చిన్నారిలోకం', 'పూలబాలలు', 'ఋతువాణి' వంటి 17 పుస్తకాలు పిల్లల కోసం రాశారు. 'బాలబంధు'గా ప్రసిద్ధులు. బాల సాహిత్యాన్ని ఉద్యమ స్ఫూర్తితో వ్యాప్తి చేయడం తన జీవిత ధ్యేయంగా బి.వి.నరసింహారావు పెట్టుకున్నారు. వింజమూరి లక్ష్మీ నరసింహారావు రాసిన 'అనార్కలి' నాటకంలో అనార్కలి పాత్ర ధరించి, 'అనార్కలి నరసింహారావు'గా ఖ్యాతి గడించారు.

ప్రస్తుత పాఠ్యభాగం బాలబంధు బి.వి. నరసింహారావు సంపూర్ణ రచనలు రెండవ సంకలనం లోనిది.

© SCERT

అమ్మఒడి




అమ్మ ఒడి చదువుల బడి మా
యమ్మ ఒడి నా కొక గుడి

అమ్మ చూపును ఒరవడి, ధై
వమ్ము కంటెను త్వరపడి

అమ్మ చెప్పిన సుద్దులు, అని
శమ్ము ఒప్పిన బుద్ధులు

అమ్మ పెదవుల హాసము ని
త్యమ్ము మాకు వికాసము

అమ్మ మంజుల భాషణం, శ్రా
వ్యమ్ము వీనుల భూషణం



అమ్మ హృది అనురాగము, ది
వ్యమ్ము భవ్యము యోగము
అమ్మ చల్లని కరములు దా
నమ్మునకు ఆకరములు

అమ్మ చరణ తలమ్ములు క్షే
మమ్ము పండు పొలమ్ములు


అమ్మ కన్నుల కాంతులు లో
కమ్మునకు సుఖశాంతులు

అమ్మయే నా సర్వము ధై
ర్యమ్ము బలమూ గర్వము

© NCERT

సారాంశం

మా అమ్మ తన ఒడిలోనే నాకు ఎన్నో సంగతులు నేర్పిన నా తొలిగురువు.
నన్ను ఎల్లప్పుడూ కాపాడుతూ బాగోగులు చూసే నా ప్రత్యక్ష దైవం.
అందుకే మా అమ్మఒడి నాకు బడి, గుడి.
దేవునికంటే ముందే త్వరపడుతూ నా భవితకు ఒరవడి చూపిస్తుంది.
అమ్మ చెప్పే మంచిమాటలు ఎల్లప్పుడూ ప్రకాశించే తెలివితేటలు.
అమ్మ పెదవులపై చిరునవ్వు మాకు నిరంతరం సంతోషాన్నిస్తుంది.
అమ్మ అందమైన మాటలు వినడం మా చెవులకే అలంకారం.
అమ్మ మనస్సులోని ప్రేమ ఉత్తమమైనది, శుభకరమైనది, అన్నిటినీ సమకూర్చేది.
అమ్మ చల్లని (మేలైన) చేతులు దానధర్మాలకు నిలయాలు.
అమ్మ పాదాలు తాకిన నేల శుభాలు పండించే పొలం వంటిది.
అమ్మ కళ్ళలోని కాంతులు లోకానికి సుఖాన్ని, శాంతిని ఇస్తాయి. అమ్మే నా ధైర్యం, బలం, గర్వం, సర్వస్వం.



ఇవి చేయండి

ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.

చదువు, వికాసం, భాషణం, సుఖశాంతులు, యోగం, అమ్మ, బుద్ధులు, ధైర్యం, గర్వం, కన్నులకాంతులు, అనురాగం, ఒరవడి.



అవగాహన - ప్రతిస్పందన



1. అమ్మ ఒడి గేయాన్ని భావంతో, రాగంతో పాడండి.
2. "అమ్మ ప్రేమ ఉత్తమమైనది". దీనిని సమర్థిస్తూ చర్చించండి.
3. **పాఠం ఆధారంగా కింది వాక్యాలను జతపరచండి**

1. అమ్మ చెప్పే మంచిమాటలు	( )	అ)	నిరంతరం సంతోషాన్నిస్తుంది.
2. అమ్మ పెదవులపై చిరునవ్వు	( )	ఆ)	అమ్మ చల్లని చేతులు
3. దానధర్మాలకు నిలయాలు.	( )	ఇ)	ఎల్లప్పుడూ ప్రకాశించే తెలివితేటలు.

4. **కింది కవిత చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**



నాన్నంటే ?
సంద్రమంత గాంభీర్యం,
కొండంత ధైర్యం,
నా పాలిట కల్పవృక్షం !

AP SCERT

అ) కొండంత ధైర్యం ఇచ్చేది ఎవరు?

జ. .....

ఆ) నాన్న గాంభీర్యం ఎలాంటిది?

జ. .....

ఇ) కల్పవృక్షంతో నాన్నను ఎందుకు పోల్చారు?

జ. .....

ఈ) ఈ కవితకు తగిన 'శీర్షిక' రాయండి.

జ. .....

5. **కింది పేరా చదివి, ప్రశ్నలకు సరియైన జవాబులు గుర్తించండి.**

మనకు ఎంతమంది స్నేహితులు, బంధువులు ఉన్నప్పటికీ.. జీవితంలో అతి ముఖ్యమైన వ్యక్తులు తల్లిదండ్రులు మాత్రమే. వారు మనల్ని కని, పెంచి, పెద్ద చేసి, పిల్లల సంతోషమే తమ సంతోషంగా భావిస్తారు. తల్లిదండ్రులను వారి మలిదశలో కంటికి రెప్పలా చూసుకుంటూ సేవ చేయడం వల్ల భగవంతుడు ఆశీర్వదిస్తాడు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా జీవించడం పిల్లలుగా మన కర్తవ్యం.

1. జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తులు ఎవరు? ( )

అ) స్నేహితులు ఆ) తల్లిదండ్రులు ఇ) బంధువులు ఈ) అధికారులు

2. భగవంతుడు ఎవరిని ఆశీర్వదిస్తాడు? ( )

అ) తల్లిదండ్రులకు సేవ చేసిన వారిని ఆ) తల్లిదండ్రులను బాధపెట్టే వారిని

ఇ) తల్లిదండ్రుల మాట వినని వారిని ఈ) తల్లిదండ్రులకు సేవ చేయని వారిని

3. పిల్లల కర్తవ్యం ఏమిటి? ( )

అ) తల్లిదండ్రుల మాట వినకపోవడం. ఆ) తల్లిదండ్రుల మాట వినడం.

ఇ) ఆటలు ఆడుకోవడం. ఈ) ఆటలు ఆడకపోవడం.

4. తల్లిదండ్రులకు సేవ చేయడం వల్ల పిల్లలకు ఏమి లభిస్తుంది? ( )

అ) శిక్ష ఆ) బాధ

ఇ) మంచిపేరు, భగవంతుని ఆశీర్వాదం ఈ) భయం

5. తల్లిదండ్రులు పిల్లల సంతోషం గురించి ఎలా భావిస్తారు? ( )

అ) పిల్లలంటే వారికి ఇష్టం లేదు. ఆ) పిల్లల సంతోషమే తల్లిదండ్రుల సంతోషం.

ఇ) పిల్లలకు జీతం వస్తుందని. ఈ) పిల్లల కష్టమే తల్లిదండ్రుల కష్టం.

APSCERT



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

1. 'అమ్మఒడి' గేయం కవి గురించి రాయండి.
2. అమ్మ మాటలు పిల్లలకు ఎలా ఉపకరిస్తాయి?

ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.

1. అమ్మ గొప్పతనాన్ని పాఠం ఆధారంగా సొంతమాటల్లో రాయండి.
2. అమ్మ ఒడి గేయం ద్వారా అమ్మ గొప్పతనం గురించి తెలుసుకున్నారు కదా! మీరు ఎప్పుడైనా మీ పాఠశాలలో గానీ బయట ఎక్కడైనా (ఆసుపత్రిలో గాని/ బ్యాంకులో గాని / పోస్ట్ ఆఫీస్ లో గాని), ఎవరికైనా సాయం చేశారా? మీ అనుభవాలను మీ మాటల్లో రాయండి.
3. మీ పాఠశాల గొప్పతనాన్ని ప్రశంసిస్తూ కింది గేయాన్ని పొడిగించండి.

   అందమైనది మా బడి

   తెలివి నేర్పే మా గుడి

   .....

   .....

   .....

   .....

   .....

   .....

   .....





భాషాంశాలు

i. పదజాలం

అ) 1. కింది వాక్యాలలో గీత గీసిన పదానికి అర్థం గుర్తించండి.

1. మంచి పుస్తకాలు చదివితే బుద్ధి పెరుగుతుంది. ( )

   అ) తెలివి ఆ) వయసు ఇ) చూపు ఈ) ఆస్తి

2. రెండు కరములు జోడించి పెద్దలకు నమస్కారం చేయాలి. ( )

   అ) కళ్ళు ఆ) కాళ్ళు ఇ) చేతులు ఈ) చెవులు

APSCERT

3. పెదవులపై హాసము అందాన్నిస్తుంది. ( )

అ) పుట్టుమచ్చ ఆ) రంగు ఇ) నవ్వు ఈ) కోపం

2. కింది వాక్యాలలో గీత గీసిన పదానికి అర్థం రాసి సొంత వాక్యం రాయండి.

ఉదా : పెద్దలు చెప్పే సుద్దులు వినాలి.

సుద్దులు = మంచి మాటలు. ఉపాధ్యాయులు చెప్పే సుద్దులు తెలివిని ఇస్తాయి.

1. తల్లిదండ్రులు పిల్లలపై చూపించే అనురాగం విలువైనది.

అనురాగం :

2. మనిషికి నిజమైన భూషణం మంచి మాటలు మాత్రమే.

భూషణం :

3. కింది గద్యం చదివి, అవసరమైన చోట విరామ చిహ్నాలు (, .) ఉంచండి.

శ్రవణ కుమారుడు ఉత్తముడు తల్లిదండ్రులు వృద్ధులు చూపులేని వారు కావడం వలన శ్రవణుడే వారి కాళ్ళు చేతులు కళ్లు అయ్యాడు కావడిలో తల్లిని తండ్రిని మోస్తూ తీర్థయాత్రలు చేయించసాగాడు

ఆ). కింది పట్టికలలోని పదాలను చదవండి. రెండేసి పదాలను కలిపి అర్థవంతమైన పదబంధం లేదా వాక్యంగా చదవండి. రాయండి.

అమల	పంట
శనగ	పలక
మర	గంప
శంఖం	పడవ
హంస	వంశం
పడవ	మండపం
దశరథ	ఊదగలం
శనగల	పయనం
ఘనతగల	నడక
మంగళకర	తనయ

ఉదా॥ శంఖం ఊదగలం.

.....

.....

.....

.....

.....

.....

.....

.....

.....

.....

APSCERT

ii. వ్యాకరణాంశాలు

మన అక్షరాల కుటుంబం - అచ్చుల పరిచయం

("భాషలో ఉన్న అక్షరాలు, స్వరాలు, వ్యంజనాలు మొదలైన అంశాలు అర్థం చేసుకోవడం.")

1. అచ్చులు

మన తెలుగు "వర్ణమాల"ను ఇప్పటివరకు చదివాం. అక్షరాలు, వాటి పేర్ల వెనుక ఉన్న రహస్యం ఏమిటి? ఒక శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం! మన లక్ష్యం బట్టీ పట్టడం కాదు, వాటి వెనుక ఉన్న శాస్త్ర జ్ఞానాన్ని అర్థం చేసుకోవడం.

- అచ్చులు (16) ప్రాణములు / స్వరములు:

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ

అచ్చుల వర్గీకరణ (వాటి లక్షణాలను బట్టి)

మనం అచ్చులను వాటి లక్షణాలను బట్టి ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

2. పలికే సమయాన్ని బట్టి (మాత్రాకాలం):

అ, ఇ, ఉ మరియు ఆ, ఈ, ఊ అక్షరాలను పలికి చూడండి. కొన్ని పలకడానికి తక్కువ సమయం, కొన్ని ఎక్కువ సమయం పడుతున్నాయి కదూ! ఈ పలికే సమయాన్ని మాత్రాకాలం అంటారు. **'మాత్ర' అంటే మనం కనురెప్పపాటు (లేదా ఒక చిటికె) వేసే సమయం.**

హ్రస్వాలు (7) : ఒక మాత్ర కాలంలో - **తక్కువ సమయంలో పలకబడేవి.**

అ, ఇ, ఉ, ఋ, ఌ, ఎ, ఒ - ఉదా : **అ**ల, **ఇ**ల, **ఉ**మ

దీర్ఘాలు (9) : రెండు మాత్రల కాలంలో - **ఎక్కువ సమయంలో పలకబడేవి.**

ఆ, ఈ, ఊ, ౠ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ - ఉదా : **ఆ**ట, **ఈ**గ, **ఊ**యల

3. అక్షరం ఆకారాన్ని బట్టి (వంకరగా ఉండటం):

కొన్ని అచ్చుల ఆకారాలు (లిపి) చూశారా? అవి కొంచెం వంగి, వంకరగా ఉంటాయి.

వక్రములు: 'వక్రము' అంటే 'వంకర'. అవి (4) :ఎ, ఏ, ఒ, ఓ - ఉదా. **ఎ**క్కడ, **ఏ**మిటి, **ఒ**కటి, **ఓ**డ

వక్రతమములు : ఇవి **'చాలా' వంకరగా** ఉంటాయి. - అవి (2) : ఐ, ఔ - ఉదా. **ఐ**దు, **ఔ**ను

4. రెండు ధ్వనుల కలయికను బట్టి (ఏర్పడే విధానం):

'ఐ', 'ఔ' అనే ఈ రెండు అచ్చులు, **రెండు వేర్వేరు ధ్వనులు కలవడం వల్ల ఏర్పడిన అచ్చులు.**

వృద్ధులు (కలయిక): అ మరియు **ఇ** అనే రెండు ధ్వనులు కలసి **ఐ** అనే ధ్వనిని వృద్ధి చేస్తాయి. (ఉదా : 'అయిదు' అని వేగంగా పలికితే 'ఐదు' అవుతుంది. కాబట్టి తెలుగులో అయిదు, మరియు ఐదు అని రెండు విధాలుగానూ పలకవచ్చు, వ్రాయవచ్చును)

- **అ** మరియు **ఉ** అనే రెండు ధ్వనులు కలసి **ఔ** అనే ధ్వనిని వృద్ధి చేస్తాయి (ఉదా: 'అవును' అని వేగంగా పలికితే **'ఔ**ను' అవుతుంది. కాబట్టి తెలుగులో అవును మరియు ఔను అని పలకవచ్చు, వ్రాయవచ్చును) కాబట్టి వీటికి **వృద్ధులు** అని పేరు.

(గమనిక : ఋ, ౠ, ఌ, ౡ అక్షరాలు ఇప్పుడు వాడుకలో చాలా అరుదు.)

AP SCERT

అభ్యాసం 1 : పాఠంలోని పదాలను పరిశీలిద్దాం!

పాఠంలో, **అచ్చులతో మొదలయ్యే** ఈ కింది పదాలను గమనించండి. వాటిలో మొదటి అక్షరం హ్రస్వమో లేక దీర్ఘమో చెప్పండి.

పదం	మొదటి అక్షరం	హ్రస్వం/దీర్ఘం
ఉదా : అమ్మ	అ	హ్రస్వం
అనిశమ్ము	అ	
ఆకరములు	ఆ	
ఉద్దేశం	ఉ	
ఎన్నో	ఎ	
ఒడి	ఒ	

అభ్యాసం 2 : జతపరుద్దాం.

వక్రము	అ
హ్రస్వము	ఔ
వృద్ధులు	ఒ
వక్రతమము	ఈ
దీర్ఘము	ఏ

అభ్యాసం 2 :

కింది సమూహంలో కొన్ని అచ్చులు, కొన్ని హల్లులు ఉన్నాయి. కేవలం హ్రస్వాచ్చులను, దీర్ఘాచ్చులను గుర్తించి, వేరు చేసి రాయండి.

క, ఉ, ప, ఆ, మ, చ, ఎ, ల, ఓ, ఇ, గ, ఐ, ఈ, ఊ

హ్రస్వాచ్చులు : .....

దీర్ఘాచ్చులు: .....

అభ్యాసం 3 : వక్రాలు, వక్రతమాలను గుర్తిద్దాం.

కింది పదాలలో, వక్రాలతో లేదా వక్రతమాలతో మొదలయ్యే పదాలను గుర్తించి, వాటి కింద గీత గీయండి

అమ్మ, ఎలుక, ఇల్లు, ఓడ, ఉడుత, ఏనుగు, ఆట, ఐదు, ఒకటి, ఔషధం

ఈ క్రింది పదాలలోని వృద్ధులను మరో విధంగా రాయండి.

అవుటు ..... ఔరా .....

అయినా ..... ఐతే .....

పరిశీలన : అచ్చులకు ఆ పేర్లు ఎందుకు వచ్చాయి? (ఇది ఉపాధ్యాయుల సహాయంతో అవగాహన కోసం మాత్రమే)

నేస్తాలూ, ఒక ఆసక్తికరమైన విషయం గమనించారా? మనం అచ్చులను "అచ్చులు" అని ఎందుకు పిలుస్తున్నాం? తెలుసుకుందామా.

AP SCERT

1. 'అచ్చులు" (వ్యాకరణ శాస్త్ర రీత్యా):

ఈ పేరు వెనుక ఒక పెద్ద భాషాశాస్త్ర రహస్యం ఉంది. ఇది వేలఏళ్ల క్రితం, పాణిని అనే గొప్ప వ్యాకరణ పండితుడు రూపొందించిన "14 మహేశ్వర సూత్రాల" నుండి వచ్చింది. ఈ సూత్రాలను శివుడు ఢమరుకం వాయిస్తే పుట్టిన శబ్దాలుగా చెబుతారు.

వాటిలో మొదటి నాలుగు సూత్రాలు ఇవి:

1. అ ఇ ఉ ణ్ 2. ఋ ఌ క్ 3. ఏ ఓ ఙ్ 4. ఐ ఔ **చ్**

సంస్కృత వ్యాకరణంలో "ప్రత్యాహారం" అనే ఒక పద్ధతి ఉంది. అంటే, మొదటి సూత్రంలోని మొదటి అక్షరాన్ని (ఇక్కడ 'అ'), చివరి సూత్రంలోని చివరి హల్లుతో (ఇక్కడ 'చ్') కలిపి చదవడం.

ఇప్పుడు చూడండి : మొదటి అక్షరం **'అ'** + నాలుగో సూత్రంలోని చివరి హల్లు **'చ్'** = "అచ్"

"అచ్" ప్రత్యాహారం అంటే 'అ' నుండి 'చ్' వరకు మధ్యలో ఉన్న అన్ని అక్షరాలు (అ, ఇ, ఉ, ఋ, ఌ, ఏ, ఓ, ఐ, ఔ) అని అర్థం. సంస్కృతంలో "అచ్" అని పిలవబడే ఈ అక్షరాలే, తెలుగులోకి వచ్చేసరికి **"అచ్చులు"**గా మారాయి.

2. "ప్రాణములు":

హల్లులు (క్, గ్, చ్...) స్వయంగా పలకలేము. వాటికి **ఒక అచ్చు చేరితేనే పలకగలం.**

- క్ + అ = క
- గ్ + ఈ = గీ

అలా హల్లులకు జీవం (ప్రాణం) పోసి, పలకడానికి వీలుగా చేస్తున్నాయి కాబట్టి అచ్చులకు "**ప్రాణములు**" అని పేరు.

3. "స్వరములు":

ఇవి హల్లులలాగా వేటి మీదా ఆధారపడకుండా, **స్వయంగా ధ్వనించగలవు** (పలకబడతాయి) కాబట్టి వీటికి "**స్వరములు**" అనే పేరు కూడా వచ్చింది.

AP SCERT



నేనివి చేయగలనా?



1.	పదాలకు అర్థాలు గుర్తించగలను.	ఔను / కాదు
2.	పదాలకు సొంతవాక్యాలు రాయగలను.	ఔను / కాదు
3.	అమ్మఒడి గేయం భావంతో, రాగంతో పాడగలను.	ఔను / కాదు
4.	అమ్మ, నాన్న / సంరక్షకుల సేవలను సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను.	ఔను / కాదు


మాతృదేవో భవ, పితృదేవో భవ

పిల్లలూ! 'మాతృదేవో భవ', 'పితృదేవో భవ' అంటారు – పెద్దలు. అంటే మొట్టమొదట పూజించ దగినవాళ్లు తల్లిదండ్రులు. ఇందుకు సంబంధించిన చిన్నచిన్న కథలు పురాణాల్లో ఉన్నాయి. తల్లిదండ్రుల్ని పూజించడం ఎంతముఖ్యమో, దానిద్వారా ఎంతటి ఫలితం కలుగుతుందో వివరిస్తాను – శ్రద్ధగా వినండి.

మనం ప్రతి సంవత్సరం వినాయకచవితి పూజ చేసుకుంటాం. అప్పుడు వినాయక వ్రతకథను వింటూ ఉంటాం. భూమండలాన్ని ముందుగా చుట్టివచ్చిన వాళ్ళకు గణాధిపత్యం ఇస్తానని పరమశివుడు ప్రకటిస్తాడు. వెంటనే కుమారస్వామి నెమలివాహనంపై భూమండల ప్రదక్షిణానికి బయలుదేరుతాడు. వినాయకుడు పెద్దబొజ్జగలవాడు కనుక అంత వేగంగా కదలలేడు. ఈ పరీక్షలో ఎలా నెగ్గాలా? అని ఆలోచిస్తూ కూర్చొని ఉన్నాడు. అంతలో అక్కడికి నారదుడు వచ్చి తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేస్తే భూమండల యాత్ర చేసినట్లేనని చెపుతాడు. ఈ విషయం గ్రహించి, వినాయకుడు తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణాలు చేసి, నమస్కరించాడు. మాతాపితలకు ప్రదక్షిణాలు చేయడం అంటే భూమండలాన్ని చుట్టిరావడమే. తన కంటే వినాయకుడే ముందు భూప్రదక్షిణ పూర్తిచేసినట్లు గుర్తించి కుమారస్వామి తన ఓటమిని అంగీకరిస్తాడు. వినాయకుడికి గణాధిపత్యం దక్కుతుంది.

చూశారా పిల్లలూ! వినాయకుడి కథవల్ల మీకు తెలియాల్సిందేమిటంటే – తల్లిదండ్రుల్ని మించిన దైవాలు లేరు. ఈ కథను వినాయకచవితి పండుగ సందర్భంగా మనం ప్రతి సంవత్సరం చెప్పుకొంటున్నామంటే తల్లిదండ్రుల్ని సేవించడం వల్ల కలిగే పుణ్యాన్ని స్మరించుకొంటున్నామని గ్రహించాలి.

అంతేగాక సోదరుల మధ్య కూడా ఎలాంటి విరోధ భావాలు ఉండకూడదు – అనే విషయాన్ని వినాయక కుమారస్వాముల సోదరత్వం ద్వారా గ్రహించాలి.



AP SCERT

2. తృప్తి

K2X4T6

అభ్యసన ఫలితాలు :

1. కథారచయితల గురించి తెలుసుకొని పాఠంలోని రచయిత గురించి వివరించగలరు.(పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
2. తృప్తి కథను సొంతమాటల్లో చెప్పి, బావగాడిలోని గుణాన్ని అభినందిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2)
3. కథలోని గుణింతాక్షర పదాలు, వాక్యాలు చదవగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3)
4. పూర్ణయ్య వంటి వ్యక్తుల వివరాలు సేకరిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-4)
5. హల్లులలోని రకాలు వాటి వివరాలు తెలుసుకుంటారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)



వినడం - ఆలోచించి మాట్లాడడం

1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
2. పిల్లలు ఏం మాట్లాడుకుంటున్నారు?
3. మీకు ఎప్పుడెప్పుడు సంతోషం కలుగుతుంది?

AP SCERT

ఉద్దేశం: సాటి మనుషుల కోసం పనిచేయడంలోనే నిజమైన సంతోషం, తృప్తి ఉన్నాయని కథ ద్వారా తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

కవి పరిచయం

సత్యం శంకరమంచి (3.3.1937 - 21.5.1987)



గుంటూరు జిల్లా అమరావతిలో జన్మించారు. 'అమరావతి కథలు', 'కార్తీక దీపాలు' కథా సంపుటాలు, 'రేపటిదారి', 'సీత స్వగతాలు', 'ఆఖరి ప్రేమలేఖ', 'ఎడారిలో కలువపూలు' మొదలైన నవలలు, హరహరమహాదేవ నాటకం, దిన, వార పత్రికలలో అనేక వ్యాసాలు రాశారు. 1979లో 'అమరావతి కథల'కు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఈ పాఠం సత్యం శంకరమంచి రాసిన అమరావతి కథలు లోనిది.

తృప్తి

పూర్ణయ్యని బావగాడంటారు అందరూ!

బావగాడు లేకపోతే సరదాలేదు, సంబరము లేదు. పెళ్ళిగాని, పేరంటంగాని వంట హంగంతా బావగాడే. వంటవాళ్ళని కూర్చోనిచ్చేవాడు కాదు. నించోనిచ్చేవాడు కాదు. పరుగులు పెట్టించేవాడు. ఇక తినేవాళ్ళకి భోజనం మీద తప్ప వేరే ధ్యాస రానిచ్చేవాడు కాదు.

ఒకసారి వనసంతర్పణ పెట్టుకున్నారు. జనం అంతా మామిడి తోపులో చేరారు. చాపలు పరచి పిచ్చాపాటి మాట్లాడుకునేవారు కొందరు. గాడిపొయ్యి తవ్వించాడో, లేదో బావగాడు జనం మధ్యకు పరుగెత్తుకొచ్చాడు. "అందరూ వినండర్రా" అని పెద్దగా గావుకేక పెట్టి మాటలు మానిపించాడు. "వంటకాలు ఇలా తయారు చేయిస్తున్నాను" అంటూ లిస్టు చదివాడు.



"వంకాయ మెంతికారం పెట్టిన కూర,
అరటికాయ నిమ్మకాయ పిండిన కూర,
పెసరపప్పుతో చుక్కకూర,
వాక్కాయ కొబ్బరి పచ్చడి,
పొట్లకాయ పెరుగుపచ్చడి,
అల్లం, ధనియాల చారు,
మసాలా పప్పుచారు,
జీడిపప్పు, పచ్చకర్పూరాలతో పాయసం,
మామిడికోరుతో పులిహోర,
గుమ్మడి వడియాలు, వూరమిరపకాయలు
అందరికీ సమ్మతమేనా?" అని అరిచాడు.

సమ్మతమేమిటి నా మొహం – అప్పటికప్పుడు అందరి నోళ్ళలో నీరూరించి ఇంకా వంటలు కాకముందే భోజనం మీద అందరికీ మమకారం పెంచాడు. జిహ్వా గిలగిలలాడుతుండగా అందరి కడుపుల్లో ఆకలి అగ్నిలా లేచింది.

అంతటితో ఆగాడు కాదు బావగాడు. మరో అరగంటలో వంకాయలు కడిగించి బుట్టలో వేయించి అందరి దగ్గరకూ ప్రదర్శనకు పట్టుకొచ్చాడు. "చూశారా! లేత వంకాయలు... నవనవలాడుతున్నాయి... మెంతికారం పెట్టి కూర వండిస్తున్నాను... దగ్గరుండి కోయించుకువచ్చాను..." అని అందరికీ చూపించి వెళ్ళిపోయాడు. ఆతరువాత జనానికి వేరే ఆలోచనలు పోయేవికావు. వంకాయ గురించే చర్చలు. వంకాయ ఎన్ని రకాలుగా కూరలు చేయొచ్చు? కాయ కాయపళంగా వండితే రుచా? తరిగి వండితే రుచా? అసలు రుచి వంకాయలో వుందా? వంకాయ తొడిమలో వుందా? ఇలా చర్చలు సాగాయి.

మరో అరగంటకి...

నిగనిగలాడే వాక్కాయల బుట్టతో, లేతచుక్కకూర మోపుతో వచ్చి అందర్నీ పలకరించాడు. "వాక్కాయ దివ్యమైన పులుపు చూడండి" అని తలా ఓ కాయ పంచాడు. "చుక్కకూర కందిపప్పుతో కంటే పెసరపప్పుతో మహా చక్కగా మేళవిస్తుంది" అని అందరికీ మళ్ళీ జ్ఞాపకం చేశాడు. మళ్ళీ జనం అంతా వంట కబుర్లలో

పడేవారు. బావగాడు ఇలా ప్రదర్శనలిస్తుంటే ఆకలి రెపరెప పెరుగుతోంది.

ఇక అక్కడ గాడిపొయ్యిదగ్గర వంటవాళ్ళని పరుగులు తీయిస్తున్నాడు. పాయసంలో ఎత్తుకు ఎత్తు జీడిపప్పు వెయ్యమని పురమాయిస్తున్నాడు.

ఓ పక్క పులిహోర తిరగమోత వెయ్యగానే రయ్యిన జనం దగ్గరకు పరుగెత్తుకు వొచ్చి "ఆ వాసన చూశారా పులిహోర తిరగమోత... సన్నబియ్యంతో చేయిస్తున్నాను" అని మళ్ళీ మాయమయ్యేవాడు.

మళ్ళీ జనానికి ఆకలి ఉవ్వెత్తున లేచింది. ఆకలి నిలువెత్తయింది. తాటి ప్రమాణమైంది. శరీరం అంతా ఆకలే అయి కూర్చుంది. జనం అంతా "ఎప్పుడు వడ్డిస్తారా?" అని ఆవురావురు మంటున్నారు. ఎట్టకేలకు గంట కొట్టాడు బావగాడు. "లేత అరిటాకులు శుభ్రంగా కడుక్కోండి" అని వరుసల మధ్యకొచ్చి హెచ్చరించాడు.

"సుబ్బయ్యన్నయ్యకు ఒక ఆకు వేస్తావేం? రెండు ఆకులు కలిపి వేయించు" అంటున్నాడు.

వడ్డనలు మొదలయ్యాయి. నేతి జారీ పుచ్చుకొని పేరు పేరునా అందర్నీ అడిగి వడ్డిస్తున్నాడు. "వంకాయ వదిలేయకూడదు. నిమ్మకాయ పిండిన అరటికాయ కూరలో కరివేపాకు రుచి తమకు తెలియనిది కాదు" అంటూ మళ్ళీ కూర వడ్డింపించి ఆకలి పెంచుతున్నాడు. జనం ఆబగా తింటున్నారు.


"చుక్కకూర పప్పులో వూరమిరపకాయలు మిళాయించండి."

"పప్పుచారులో గుమ్మడి వడియాలు కలిపి చూడండి."

"వాక్కాయ పచ్చడిలో పెరుగు పచ్చడి నంజుకోవచ్చు. తప్పులేదు."

"ఇంకా విస్తట్లో మిగిల్చావేం. పూర్తిచేసి పాయసానికి ఖాళీగా వుంచుకో..."

"అప్పుడే మంచినీళ్ళు తాగెయ్యకు. మీగడ పెరుగుంది..."



ఇలా ఎగసన తోస్తుంటే ఎవరాగగలరు? జనం కలబడి భోంచేశారు. జన్మలో ఇంత దివ్యమైన వంట ఎరగమన్నారు. విస్తళ్ళముందునుంచి పైకి లేవడమే కష్టమైంది. అందరికీ తాంబూలాలు ఇచ్చిన తరువాత వంటవాళ్ళని కూర్చోబెట్టాడు బావగాడు. "కష్టపడి వండారు తినకపోతే ఎలా?" అని కొసరి కొసరి వడ్డించాడు. వాళ్ళ భోజనాలు కూడా అయిన తరువాత అందరికంటే ఆఖరున గాడిపొయ్యి పక్కన ఓ చిన్న ఆకు వేసుకుని తను కూర్చున్నాడు.

అప్పటికి కూరలు మిగల్లేదు.

ఓ గంటె పప్పు, కాస్తంత పచ్చడి, గుప్పెడు పులిహోర, మిగిలితే అవే వడ్డింపించుకుని వంటరుచిని మళ్ళీ మళ్ళీ మెచ్చుకుంటూ అందరి భోజనం తనే చేస్తున్నాను అన్నంత హాయిగా భోంచేశాడు. తనకేం మిగల్లేదనే బాధలేదు. నలుగురూ హాయిగా, తృప్తిగా, రుచిగా తిన్నారనే సంతోషమే ఆ బావగాడి తాంబూలపు పెదాలపైని చిరునవ్వు.

AP SCERT



అవగాహన - ప్రతిస్పందన

1. 'తృప్తి' కథలో మీకు నచ్చిన అంశాల గురించి చెప్పండి.
2. పూర్ణయ్య పాత్ర ద్వారా నిజమైన తృప్తిని తెలియజేసిన రచయిత గురించి మాట్లాడండి.
3. వనసంతర్పణలో జనాలకు ఆకలి ఎందుకు పెరిగిపోయింది ?
4. **లేఖ చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి**

తోట పాలెం,
17-08-2026.

ప్రియమైన లతకు,

నేను క్షేమం. నీవు క్షేమమని తలుస్తాను. ముఖ్యంగా రాయునది ఏమంటే మా పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా మా ఉపాధ్యాయులు చెప్పిన మాటలతో నాలో ఒక పెద్ద మార్పు వచ్చింది.

అన్నం దైవ స్వరూపం కాబట్టి ఆహారాన్ని వృథా చేయకూడదు. ఆహారం లేక బాధపడుతున్న దేశాల గురించి ఆదేశాల్లో పిల్లల కష్టాల గురించి చెబుతుంటే నేను ఆహారాన్ని వృథా చేసిన సందర్భాలు జ్ఞాపకం వచ్చాయి. నాకు చాలా దుఃఖం వచ్చింది. నేను ఎప్పుడూ ఆహారాన్ని వృథా చేయకూడదనీ, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలని నిర్ణయించుకున్నాను. చిన్నతనం నుండి మనిద్దరిదీ ఒకే మాట కాబట్టి నీవు కూడా నాలాగే ఈ అలవాటు పాటిస్తావని నీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. సంక్రాంతి సెలవులకు కలుద్దాం. నీ కోసం ఎదురుచూస్తుంటాను.

ఇట్లు,
నీ స్నేహితురాలు,
బి. వర్షిణి.

చిరునామా,
ఎస్ లత, 6వ తరగతి,
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల – పాడేరు,
అల్లూరి సీతారామరాజు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

1. వర్షిణి లేఖలో ఏ విషయాన్ని గురించి ప్రస్తావించింది?
2. ఆహారం ఎందుకు వృథా చేయకూడదు?
3. వర్షిణి ఎవరికి ఉత్తరం రాసింది?
4. ఆహారం వృథా చేయకుండా ఉండటానికి నీవు ఏమి చేస్తావు?
5. లేఖ ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

1. తృప్తి పాఠ్యభాగ రచయిత గురించి రాయండి.
2. వనసంతర్పణలో పూర్ణయ్య తృప్తికి కారణం ఏమిటి ?

ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.

1. 'తృప్తి' కథలో పూర్ణయ్య పాత్ర ద్వారా మీరు తెలుసుకున్న విషయాలను వివరించండి.

AP SCERT

2. మీరెప్పుడైనా ఎవరికైనా భోజనం పెట్టి తృప్తిని కలిగించారా? వివరాలు రాయండి.

3. పూర్ణయ్యలాంటి వ్యక్తులు మీకు తెలిసిన వారుంటే వారిని ప్రశంసిస్తూ రాయండి.



భాషాంశాలు

i. పదజాలం

1) కింది పదాలకు అర్థాలను పట్టికలో గుర్తించి రాయండి.

1. ధ్యాస = ...
2. సమ్మతం = ...
3. జిహ్వా = ...
4. అనురాగం = ...

ఆ	అ	య	ప	అం
లో	చ	ప్రే	మ	గీ
చ	నా	లు	క	కా
న	ట	జ	వ	రం

2) కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాసి సొంత వాక్యాలు రాయండి.

1. వన సంతర్పణకు వచ్చిన వారంతా మామిడి తోటలో చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు.
2. 'అందరూ వినండర్రా' అని గావుకేక పెట్టాడు పూర్ణయ్య.

3) కింది వాటిని పాఠం ఆధారంగా సరైన క్రమంలో జతపరచండి.

1. జిహ్వా ( ) అ) నిగనిగలాడుతున్నాయి
2. వంకాయలు ( ) ఆ) రెపరెప పెరుగుతుంది
3. ఆకలి ( ) ఇ) నవనవలాడుతున్నాయి
4. వాక్యాయలు ( ) ఈ) గిలగిలలాడుతుంది

4. పాఠంలోని కింది పదాలను చదవండి. కింది పట్టికను పూరించండి.

చాపలు, వంకాయ, పెసరపప్పు, అన్నం, మెంతికారం, పొట్లకాయ, గరిటె , పులిహోర, చారు, బుట్ట, అరటికాయ, వడియాలు, మసాలా, పసుపు, వాక్యాయ, గంట, విస్తరి, పాయసం, ధనియాలు, మామిడికాయ, పొయ్యి, మిరపకాయ, పచ్చడి, పచ్చకర్పూరం, జాడి, జీడిపప్పు, నిమ్మకాయ.

వంటకాలు	కూరగాయలు	కిరాణా సరుకులు	వస్తువులు

AP SCERT

హల్లుల ప్రపంచం – మన నోరు ఒక ప్రయోగశాల!

గత పాఠంలో మనం "ప్రాణములు" లేదా "అచ్చులు" గురించి తెలుసుకున్నాం. అవి లేకపోతే హల్లులకు జీవం లేదని కూడా గమనించాం. ('క్' + 'అ' = 'క').

ఇప్పుడు మనం అచ్చులపై ఆధారపడే "హల్లులు" గురించి తెలుసుకుందాం. బట్టీ పట్టొద్దు! మన నోటినే ఒక **సైన్స్‌ల్యాబ్** లా వాడి, అక్షరాన్ని ప్రయోగించి (ఉపయోగించి) ప్రతి అక్షరం ఎక్కడ, ఎలా పుడుతుందో మనమే పరిశీలించి తెలుసుకుందాం!

వర్ణాక్షరాలు : అక్షరాల సైన్యం

హల్లులలో మొదటి **25 + 2** అక్షరాలను (క నుండి మ వరకు) మన వ్యాకర్తలు ఒక అద్భుతమైన పద్ధతిలో **5 "వర్గాలుగా"** విభజించారు. ఎందుకో తెలుసా? అవి పుట్టేస్థానాన్ని బట్టి!

మీరే ప్రయత్నించండి :

1. **క-వర్గం (క, ఖ, గ, ఘ, ఙ) :** ఈ అక్షరాలు పలికేటప్పుడు, శబ్దం ఎక్కడ నుండి వస్తోంది? మీ గొంతు (కంఠం) లోపలి నుండి. అందుకే వీటిని **కంఠ్యాలు** అంటారు. ఇవి **కంఠం నుండి పుడుతున్నాయి** అని తెలుసుకోవడానికి ఒక చిన్న పరీక్ష మీకు మీరుగా చేసుకోండి. ఈ అక్షరాలు పలికేటప్పుడు మీ చూపుడు వేలు అడ్డంగా గొంతు దగ్గర తాకించి ఉంచండి. ఆ అక్షరాలు పలుకుతున్నప్పుడు ఆ స్పర్శను అనుభూతి చెందండి, మీకే తెలుస్తుంది.

   (ఉపాధ్యాయుల సహాయంతో ఇలాంటి పరీక్షే ప్రతి వర్ణాక్షరాల దగ్గర చేయండి.)

2. **చ-వర్గం (చ, ఛ, జ, ఝ, ఞ) :** మీ నాలుక పైనున్న దవడ భాగాన్ని (తాలువు) తాకుతోంది కదూ! తాలువు అంటే దవడ అని అర్థం. అందుకే ఇవి **తాలవ్యాలు.**

3. **ట-వర్గం (ట, ఠ, డ, ఢ, ణ):** మీ నాలుక వెనక్కి తిరిగి పై భాగాన్ని తాకుతోంది. పై అంగిలి భాగాన్ని మూర్ధన్యం అంటాం. అందుకే ఇవి **మూర్ధన్యాలు.**

4. **త-వర్గం (త, థ, ద, ధ, న):** మీ నాలుక కొన మీ **పళ్లను (దంతాలు)** తాకుతోంది. అందుకే ఇవి **దంత్యాలు.**

5. **ప-వర్గం (ప, ఫ, బ, భ, మ):** మీ రెండు **పెదవులు (ఓష్ఠ్యాలు)** ఒకదానికొకటి తాకుతున్నాయి. అందుకే ఇవి **ఓష్ఠ్యాలు.**

మనం ప్రారంభంలో 25 + 2 అన్నాం కదా. ఆ రెండు ఏమిటో తెలుసుకోవాలని ఉంది కదూ! చవర్గంలో చెప్పిన చ మరియు జ అనే అక్షరాలు తాలవ్యాలని తెలుసుకున్నాం కదా, వీటికి మరొక ఉచ్చారణ కూడా ఉంది. అవే ఆ రెండు. ఆ అక్షరాలేమిటో చూద్దాం.

దంత్య 'చే', 'జే' : నాలుకను దంతాల వెనుక తగిలించి పలికేవి (ఉదా : చేప, జొబిలి).

- ఈ రెండు అదనపు ధ్వనులను (దంత్య చ, జ) కూడా కలిపినప్పుడే, వర్ణాక్షరాల సంఖ్య 25+2=27 మరియు మొత్తం హల్లుల సంఖ్య 37 అవుతుంది. లిపిలో (వ్రాతలో) వీటికి వేరే అక్షరాలు లేకపోయినా, ధ్వనిలో ఈ భేదం ఉంది.

AP SCERT

మనం ఈ 'ఉచ్చారణ' భేదాన్ని గమనించడం చాలా ముఖ్యం! **గమనించారా?** ఎంత శాస్త్రీయంగా మన వర్ణమాల అమర్చబడిందో!

పరిశీలన: వర్గాక్షరాలను నిలువుగా చూద్దాం!

పిల్లలూ, ఇప్పుడు మనం ఈ 5 వర్గాలను (25 అక్షరాలు) ఒక పట్టికలో వేసి, వాటిని నిలువుగా పరిశీలిద్దాం. అప్పుడే మనకు మరిన్ని భేదాలు తెలుస్తాయి.

వర్గము	1. ప్రథమ	2. ద్వితీయ	3. తృతీయ	4. చతుర్థ	5. పంచమ
క-వర్గం	క	ఖ	గ	ఘ	ఙ
చ-వర్గం	చ	ఛ	జ	ఝ	ఞ
ట-వర్గం	ట	ఠ	డ	ఢ	ణ
త-వర్గం	త	థ	ద	ధ	న
ప-వర్గం	ప	ఫ	బ	భ	మ

పై పట్టికలోని నిలువు వరుసల ఆధారంగా మన వ్యాకరణ వేత్తలు వాటికి కొన్ని ప్రత్యేక పేర్లు పెట్టారు.

1. **పరుషాలు : క, చ, ట, త, ప** (పట్టికలోని 1వ నిలువు వరుస. వీటికే వర్గ ప్రథమాక్షరాలని పేరు)
   - **ఎందుకా పేరు? 'పరుషం'** అంటే **'కఠినం'**. ఈ అక్షరాలను పలకడం కొంచెం **కఠినంగా, గట్టిగా** ఉంటుంది.
     (ఉదా: **'క'** పలకండి, **'గ'** పలకండి. **'గ'** కంటే **'క'** గట్టిగా పలుకుతాం కదూ! క పలకడానికి ఎక్కువ ప్రయత్నం అవసరం.)
2. **సరళాలు : గ, జ, డ, ద, బ** (పట్టికలోని 3వ నిలువు వరుస. వీటికే వర్గ తృతీయాక్షరాలని పేరు)
   - **ఎందుకా పేరు? 'సరళం'** అంటే **'తేలిక'**. ఈ అక్షరాలను పలకడం చాలా **తేలికగా, మృదువుగా** ఉంటుంది.
3. **వర్గయుక్కులు / మహా ప్రాణాలు : ఖ, ఛ, ఠ, థ, ఫ.** (2వ నిలువు వరుస. వర్గ ద్వితీయాక్షరాలు) మరియు **ఘ, ఝ, ఢ, ధ, భ** (4వ నిలువు వరుస, వర్గ చతుర్థాక్షరాలు).
   - ఎందుకా పేరు? **వర్గయుక్కులు : 'యుక్'** అంటే **'కలిసి ఉండటం'**. ఇవి ఉచ్చారణ సమయంలో **'హ'** కార ధ్వనితో కలిసి పలుకుతాం.
     (ఉదా: క్ + హ = ఖ; గ్ + హ = ఘ).
   - **మహా ప్రాణాలు: 'మహా'** అంటే **'ఎక్కువ'**, **'ప్రాణం'** అంటే **'ఊపిరి'**. ఈ అక్షరాలను పలికేటప్పుడు **ఎక్కువ గాలి (ఊపిరి) బయటకు వస్తుంది.** మీ చేతిని నోటి దగ్గర పెట్టుకుని **'క'** మరియు **'ఖ'** పలికితే ఈ తేడా మీకే తెలుస్తుంది. ఈ **మహాప్రాణాక్షరాలు ఉన్న పదాలన్ని సంస్కృత భాష నుండి మన తెలుగు భాషలోనికి వచ్చిన పదాలు.**
4. **అనునాసికాలు : ఙ, ఞ, ణ, న, మ.** పట్టికలోని 5వ నిలువు వరుస.
   వీటికే వర్గ **పంచమాక్షరాలని** పేరు
   - ఎందుకా పేరు? **'నాసిక'** అంటే **'ముక్కు'**. ఈ అక్షరాలను పలికేటప్పుడు **ధ్వని ముక్కు ద్వారా కూడా వస్తుంది.**
     ఉదా : **'మ'** అని పలికేటప్పుడు ముక్కును మూసుకుంటే సరిగ్గా పలకలేము. గమనించండి!
     క నుండి **మ** వరకు గల ఈ 27 (25 + 2) అక్షరాలకు వర్గాక్షరాలని పేరు.


AP SCERT

5. ఊష్మములు – (4):

- ఎందుకా పేరు? **(పరిశీలన):**
- **ఊష్మము అనగా గాలి అని అర్థం.**
- **శ, ష, స, హ (గాలిని ఊదుతూ, రాపిడితో పలుకుతాం)**

6. అంతస్థములు – (4) :

- ఆ అక్షరాలు ఏవి? **య, ర, ల, వ**
- **ఎందుకా పేరు? (పరిశీలన):**
- ఈ పదం యొక్క అర్థం **"మధ్యలో ఉన్నవి" ('అంతః' = మధ్య, 'స్థ' = ఉన్నవి).**
- **దేనికి మధ్యలో?** ఇవి ధ్వని ఉత్పత్తి (ఉచ్చారణ)లో **వర్గములకు** మరియు **ఊష్మములకు** మధ్యస్థంగా ఉంటాయి.



- **శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం:**
- **'ప'** పలికినట్లుగా అంతస్థాలు పలికేటప్పుడు గాలిని పూర్తిగా ఆపము.
- **'శ'** పలికినట్లుగా అంతస్థాలు పలికేటప్పుడు గాలిని తీవ్రమైన రాపిడి కలిగించము.
- మన నోటిలోని భాగాలు (నాలుక, అంగిలి) ఒకదానికొకటి చాలా దగ్గరగా వస్తాయి కానీ పూర్తిగా అంటుకోవు. అందుకే వీటిని ఆధునిక భాషా శాస్త్రంలో (సమీపించేవి) అంటారు.
- **'య'** కారం అచ్చులలోని **'ఇ'** కారానికి, **'వ'** కారం **'ఉ'** కారానికి చాలా దగ్గరగా పలుకుతాం. అందుకే వీటిని **"అర్ధ-అచ్చులు"** అని కూడా పిలుస్తారు.

7. ఇతరాలు – (2):

- **ళ** (దీనికి అలఘులకారం అని పేరు) **ఱ** (దీనికి శకట రేఫ అని పేరు)

పరిశీలన : హల్లులకు ఆ పేరెలా వచ్చింది? (ఉపాధ్యాయుల సహాయంతో అవగాహనకు మాత్రమే)

- **"హల్లులు"** (వ్యాకరణ శాస్త్ర రీత్యా):

మిత్రులారా, అచ్చుల **("అచ్")** లాగే, హల్లుల పేరు కూడా పాణిని **"మహేశ్వర సూత్రాల"** నుండే వచ్చింది. అచ్చుల సూత్రాలు 4వ సూత్రంలోని **'చ్'** తో ముగిశాయి కదా. ఆ తర్వాత 5వ సూత్రం నుండి 14వ సూత్రం వరకు హల్లుల గురించి చెబుతాయి.

- **5వ సూత్రం :** హ య వ ర ట్ 6: ల ణ్ 7: ఞ మ ఙ ణ న మ్ 8: ఝ భ ఞ్ 9: ఘ ఢ ధ ష్ 10: జ బ గ డ ద స్ 11: ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్ 12: క ప య్ 13: శ ష స ర్ **14వ సూత్రం :** హ **ల్**

ఇప్పుడు **"ప్రత్యాహారం"** గమనించండి: 5వ సూత్రంలోని మొదటి అక్షరం **'హ'** + 14వ సూత్రంలోని చివరి అక్షరం **'ల్'** = **"హల్"**. **"హల్"** ప్రత్యాహారం అంటే **'హ'** నుండి **'ల్'** వరకు ఉన్న అన్ని **వ్యంజన శబ్దాలు** అని అర్థం. సంస్కృతంలో **"హల్"** అని పిలవబడే ఈ అక్షరాలే, తెలుగులోకి వచ్చేసరికి **"హల్లులు"**గా మారాయి. అద్భుతం కదూ!

ఉభయాక్షరాలు

- ఈ అక్షరాలు అచ్చులు మరియు హల్లులు రెండింటితోనూ కలిసి ఉంటాయి, లేదా వాటి లక్షణాలను కలిగి ఉంటాయి. కాబట్టి వీటికి **'ఉభయ'** (రెండు) అక్షరాలు అని పేరు.

AP SCERT

- సున్న (ం) – (దీనిని **'అం'** అని అచ్చుతో లేదా 'కం' అని హల్లుతో కలుపుతాం)
- అరసున్న (ఁ) – **(పద్యాలలో వాడుకలో ఉంది. మరియు కొన్ని పదాలలో అరసున్న ఉండడం చేత అర్థం కూడా మారుతుంది. ఉదాహరణకు నాఁడు అనే పదంలో అరసున్న ఉంటే రోజు అని అర్థం.** అరసున్న లేకుండా నాడు అని వ్రాస్తే దేశం అని అర్థం. మన తెలుగు భాషలో మాత్రమే ఉన్న ఈ అరసున్న గొప్పతనం తెలుసుకుంటే మన భాష ప్రత్యేకత, ఘనత తెలుస్తోంది కదూ!

  విసర్గ (ః) – (ఉదా: అంతఃపురం, దుఃఖం)

గుణింతాలు ఎలా ఏర్పడతాయో ఎపుడైనా ఆలోచించారా

ప్రతి హల్లుకు సహజంగా 'పొల్లు' (్) గుర్తు ఉంటుంది. అంటే అది స్వచ్ఛమైన హల్లు ధ్వనిని మాత్రమే సూచిస్తుంది. ఉదాహరణకు, 'క' లోని స్వచ్ఛమైన హల్లు ధ్వని **'క్'**. ఈ పొల్లు హల్లులు (క్, గ్, చ్, జ్...) సొంతంగా పలకలేము. అవి పలకాలంటే వాటికి తప్పనిసరిగా ఒక అచ్చు తోడు కావాలి. ఈ పొల్లు హల్లులకు అచ్చులు (అ, ఆ, ఇ, ఈ...) చేరినప్పుడు గుణింత అక్షరాలు ఏర్పడతాయి.

- **'అ' కారం (తలకట్టు)(ఁ): 'అ'** అనేది తలకట్టుతో ఉన్న ప్రతి హల్లులోనూ అంతర్లీనంగా ఉంటుంది. ఇది చేరినప్పుడు హల్లు తన పొల్లు రూపాన్ని కోల్పోయి, తలకట్టుతో పూర్తి అక్షరంగా మారుతుంది.

• క్ + అ = (ఁ)(తలకట్టు)	= క	• క్ + ఋూ=(ృా)(ఋత్వం దీర్ఘం)	= కౄా
• క్ + ఆ = (ా)(దీర్ఘం)	= కా	• క్ + ఎ = (ె) (ఎత్వం)	= కె
• క్ + ఇ = (ి)(గుడి)	= కి	• క్ + ఏ = (ే) (ఏత్వం)	= కే
• క్ + ఈ = (ీ)(గుడి దీర్ఘం)	= కీ	• క్ + ఐ =(ై) (ఐత్వం)	= కై
• క్ + ఉ = (ు) (కొమ్ము)	= కు	• క్ + ఒ = (ొ) (ఒత్వం)	= కొ
• క్ + ఊ =(ూ) (కొమ్ము దీర్ఘం)	= కూ	• క్ + ఓ =(ో) (ఓత్వం)	= కో
• క్ + ఋ = (ృ) (ఋత్వం)	= కృ	• క్ + ఔ = (ౌ) (ఔత్వం)	= కౌ

వీటితో పాటు, ఉభయాక్షరాలు అయిన 'అం' (సున్న) మరియు 'అః' (విసర్గ) కూడా ఈ పట్టికలో చేరతాయి.

- క్ + అం (సున్న ం) = **కం**
- క్ + అః (విసర్గ ః) = **కః**

ఈ విధంగా ఒకే 'క్' అనే మూల హల్లు ధ్వని, వివిధ అచ్చులతో కలవడం వలన 'క, కా, కి, కీ, కు, కూ...' వంటి అనేక రూపాలను పొందుతుంది. ఈ అక్షరాల శ్రేణి మొత్తాన్నే మనం 'క-గుణింతం' అంటాము.

"గుణింతం" పేరులోని ఔచిత్యం

"గుణింతం" అనే పదం **"గుణించడం"** అనే పదం నుండి వచ్చింది. "గుణించడం" అంటే **"పెంచడం"**. ఇక్కడ ఈ పేరు పెట్టడంలో ఔచిత్యం ఏమిటంటే :

AP SCERT

'క్' అనేది ఒకే ఒక మూల ధ్వని. దీనికి అచ్చుల గుర్తులను (దీర్ఘం, గుడి, కొమ్ము) చేర్చడం ద్వారా, మనం ఆ ఒక్క ధ్వని యొక్క రూపాలను అనేక రకాలుగా **'గుణిస్తున్నాము'** (పెంచుతున్నాము). మరో రకంగా చూస్తే గుణం అంటే లక్షణం. అచ్చులు అనేవి హల్లుల ధ్వనికి రకరకాల గుణాలను ఆపాదిస్తాయి. ఈ **'గుణాల'** సముదాయమే **'గుణింతం'** అని కూడా భావించవచ్చు. హల్లులు ప్రాణముల (అచ్చుల) చేత గుణించబడుతున్నాయి కాబట్టి వీటికి ప్రాణులు అని పేరు. వ్యంజనములు అని మరొక పేరు. అచ్చుల సహాయంతో తమను తాము **"వ్యక్తీకరించుకుంటాయి"** కాబట్టి, హల్లులకు **"వ్యంజనములు"** అని పేరు వచ్చింది. (**"వ్యజతే అనేన ఇతి వ్యంజనం"** – అంటే, **"దీని ద్వారా (అచ్చు ద్వారా) అక్షరం స్పష్టం చేయబడుతుంది"** అని అర్థం.)

క్లుప్తంగా చెప్పాలంటే, **ఒక హల్లును వివిధ అచ్చులతో "గుణించడం" వలన ఏర్పడే అక్షరాల పట్టిక** కాబట్టి, దీనికి **'గుణింతం'** అనే పేరు సంపూర్ణంగా సరిపోతుంది.

అభ్యాసం 1 : పరుషాలను వెతుకుదాం!

'పరుషాలు' **(క, చ, ట, త, ప)** అంటే పలకడానికి కఠినంగా ఉండే హల్లులు. **"తృప్తి"** పాఠం నుండి, పరుషాలతో మొదలయ్యే పదాలను వెదికి వ్రాయండి.

క: కూర్చోనిచ్చేవాడు ....

చ: చాపలు, ...

త: తృప్తి, ...

ప: పెళ్ళి, ...

అభ్యాసం 2: సరళాలను వెతుకుదాం!

'సరళాలు' **(గ, జ, డ, ద, బ)** అంటే పలకడానికి సులభంగా ఉండే హల్లులు. **"తృప్తి"** పాఠం నుండి, ఈ అక్షరాలతో మొదలయ్యే కొన్ని పదాలను వెతికి, కింది ఖాళీలను పూరించండి.

ఉదా: బ బావగాడు

గ ..... **జ** ..... **ద**.....

అభ్యాసం 3: అనునాసికాలను గమనిద్దాం!

'అనునాసికాలు' **(ఙ, ఞ, ణ, న, మ)** అంటే **ముక్కు సహాయంతో పలికేవి.** **"తృప్తి"** పాఠంలో **'న', 'మ'** అక్షరాలతో మొదలయ్యే పదాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని కింద గమనించి సున్నా చుట్టండి

- **న :** నవనవలాడుతున్నాయి, నంజుకోవచ్చు, నలుగురూ
- **మ :** మామిడి, మాటలు, మమకారం, మసాలా, మెచ్చుకుంటూ

AP SCERT

అభ్యాసం 4: ఓష్ఠ్యాలను, అంతస్థాలను వెతుకుదాం.

ఈ కింది వాక్యాలోని ఓష్ఠ్యాల, అంతస్థ అక్షరాలకింద గీతగీసి రాయండి.

1. మరో అరగంటలో వంకాయలు కడిగించి బుట్టలో వేయించి అందరి దగ్గరకు ప్రదర్శనకు పట్టుకొచ్చాడు.
2. బావగాడు లేకపోతే సరదా లేదు. సంబరము లేదు. పెళ్లి గాని, పేరంటము గాని వంట హంగంతా బావగాడిదే.

1. ఓష్ఠ్యాలు .....

2. అంతస్థాలు .....

అభ్యాసం 5: ఊష్మాలను వెతుకుదాం.

'ఊష్మములు' **(శ, ష, స, హ)** అంటే **గాలిని ఊదుతూ, రాపిడితో పలికే అక్షరాలు.** **"తృప్తి"** పాఠం నుండి ఈ అక్షరాలు ఉన్న / మొదలయ్యే పదాలను వెతికి, కింది ఖాళీలను పూరించండి.

ఉదా : స సరదా

శ ..... **ష** .....

స ..... **హ** .....

కింది వాక్యంలో గీత గీసిన పదాలలో ఉన్న అక్షరాలను ఏమంటారు?

చుక్కకూర కందిపప్పుతో కంటే పెసరపప్పుతో మహా చక్కగా మేళవిస్తుంది.

అ) పరుషాలు ఆ) సరళాలు ఇ) అనునాసికాలు ఈ) ఊష్మాలు

ప్రాజెక్టుపని

(మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)

ఇతరుల కోసం త్యాగం చేసిన మహాపురుషుల కథలు మూడింటిని గ్రంథాలయం నుంచి సేకరించి ప్రదర్శించండి. (ఉదా॥ శిబిచక్రవర్తి, రంతిదేవుడు మొ॥నవి)



నేనివి చేయగలనా?



1.	'తృప్తి' కథను సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను.	ఔను / కాదు
2.	పదాలకు అర్థాలు గుర్తించగలను	ఔను / కాదు
3.	పదాలకు సొంతవాక్యాలు రాయగలను	ఔను / కాదు
4.	పదాలను సరైన క్రమంలో జతపరచగలను	ఔను / కాదు

AP SCERT



చదవండి - ఆనందించండి

రంతి దేవుడు



పూర్వం రంతిదేవుడనే రాజు ఉండేవాడు. అతడు నిరతరం దైవచింతనతో కాలంగడిపేవాడు. తనకు లభించిన దానితోనే తృప్తిపడేవాడు. తన సంపదలను బీదలకు దానం ఇచ్చి చివరకు బీదవాడయ్యాడు. కుటుంబంతో సహా చాలా కష్టాలపాలయ్యాడు. నలభై ఎనిమిది రోజులు అన్నము నీళ్ళు లేకుండా సకుటుంబంగా ఉపవాసం ఉన్నాడు.



ఉపవాసం తరువాత భరించలేని ఆకలితో భోజనం చేయడానికి సిద్ధపడుతుండగా ఓ దీనుడు అతిథిగా వచ్చాడు. రంతిదేవుడెంతో ప్రేమతో అతని గౌరవించి, ఆహారంలో అర్ధభాగాన్ని అతడికిచ్చాడు. అతను కడుపారా భుజించి సంతృప్తుడై వెళ్ళాడు.

మిగిలిన భోజనంతో రంతిదేవుడు ఆకలి తీర్చుకోవాలని సిద్ధపడ్డాడు. ఇంతలోనే కుక్కల గుంపుతో ఒకడువచ్చాడు. "రాజా! నేను ఈ కుక్కలు ఆకలిచే బాధపడుతున్నాము. మాకు ఆహారము ఇమ్ము" అని అడిగాడు. అతడికి మిగిలిన ఆహారమంతా ఇచ్చి నమస్కరించి పంపాడు రంతిదేవుడు.

ఇక రంతిదేవుని వద్ద నీళ్ళొకటి మిగిలాయి. అదీ ఒక్కరికి సరిపడా ఉన్నాయి. ఆకలితో ప్రాణాలు కడగడుతున్న రంతిదేవుడు ఆ నీరు త్రాగబోగా మరొక వ్యక్తి వచ్చి "అయ్యా! చాలా ఆకలిగా ఉంది. నీరసముతో అడుగు ముందుకు వేయలేకున్నాను. నా ప్రాణాలు నిలబెట్టు" అన్నాడు. ఆ దీనుని చూచి "ఓ అన్నా! నావద్ద అన్నం లేదు కానీ ఈ తియ్యని నీళ్ళున్నాయి. ఈ నీళ్లు త్రాగు." అని రంతిదేవుడన్నాడు. ఆపదకలిగిన వారి కష్టాలు పోగొట్టి వారిని ఆదుకోవడం కన్నా మానవులకు పరమార్థమేమున్నది?. నా జలదానంతో ఈతడి బాధ తొలగితే నాకంతే చాలు. అంతా ఈశ్వరేచ్ఛ" అని ఆ వ్యక్తి పాత్రలో నీళ్ళు పోశాడు.

బ్రహ్మాది దేవతలు సంతోషించి రంతిదేవుని ఎదుట ప్రత్యక్షమై జరిగినదంతా విష్ణుమాయా ప్రభావం అని చెప్పారు. "ఇప్పటివరకు నీదగ్గరకు మారువేషములలో వచ్చినది మేమే" అని తెలియజేసి రంతిదేవుని ఆశీర్వదించారు. రంతిదేవుడు వారికి నమస్కరించాడు. తన ప్రాణాలను లెక్కచేయకుండా ఆపదలో ఉన్నవారికి సహాయపడిన రంతిదేవుడు ధన్యుడయ్యాడు.

AP SCERT

3. మాకొద్దీ తెల్ల దొరతనం

H2Z9H9

అభ్యసన ఫలితాలు :

1. స్వాతంత్ర్యం కోసం భారతీయులు పడిన కష్టాలు చెప్పగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
2. గేయాన్ని రాగయుక్తంగా అభినయిస్తూ పాడగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2)
3. గేయం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3)
4. స్వాతంత్రోద్యమ గీతాలు, పద్యాలు, పాటలు, చిత్రాలు మొదలైనవి సేకరించగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-4)
5. భాషా భాగాలైన లింగ, వచనాలు మొదలైనవి గ్రహించి వినియోగిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)



వినడం - ఆలోచించి మాట్లాడడం




1. చిత్రం చూడండి. చిత్రం గురించి మాట్లాడండి.

ఉద్దేశం : ఆంగ్లేయుల ప్రభుత్వంలో భారతీయులు ఎన్నో శారీరక, మానసిక బాధల్ని అనుభవించారు. స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. స్వాతంత్ర్యంకోసం ఆనాటి ప్రజలు పడిన కష్టాల్ని, ఆంగ్లేయుల అధికారానికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

కవి పరిచయం

గరిమెళ్ల సత్యనారాయణ (14.7.1893 -18.12.1952)



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడులో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధులు, కవి, రచయిత. 1921లో 'స్వరాజ్య గీతములు', 1923లో 'హరిజనుల పాటలు', 1926లో ఖండ కావ్యాలు, భక్తి గీతాలు, బాల గీతాలు రాశారు. "దండాలండోయి మేముండలేమండోయ్ బాబు", 'మాకొద్దీ తెల్లదొరతనము' అనే గేయాలతో సామాన్య ప్రజల్లో సైతం స్వాతంత్ర్య ఉద్యమ ఉత్తేజాన్ని, చైతన్యాన్ని కలిగించిన జాతీయ కవి. దేశభక్తి కవితలు రాసి జైలు శిక్ష అనుభవించిన వారిలో మొదటివారు గరిమెళ్ల.

AP SCERT

మాకొద్దీ తెల్ల దొరతనము

1. మాకొద్దీ తెల్ల దొరతనము, దేవ
మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించె
।।మాకొద్దీ।।


2. పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండీ
ఉప్పుముట్టుకుంటే దోషమండీ
నోట మట్టిగొట్టి పోతాడండీ
అయ్యో! కుక్కలతో పోరాడి కూడూ తినమంటాడు
।।మాకొద్దీ।।

3. ధనము కోసము వాడు దారి చేసికోని
కల్లు సారాయమ్ముతాడు
మాదు మూటాముల్లెలు దోచినాడు
ఆలి మెళ్లో పుస్తెలు తెంచుతాడు
మాదు కళ్లల్లో దుమ్మేసి కాటికి దరిచేసాడు
।।మాకొద్దీ।।

4. గాంధీ టోపీ పెట్టి పాఠశాలకు బోవ
రావద్దు రావద్దంటాడు
రాట్నం బడిలో పెట్టవద్దంటాడు
టోపి తీసి వీపులు బాదుతాడు
అయ్యో! రాజద్రోహమంత రాట్నంలో ఉన్నదంట
।।మాకొద్దీ।।


5. నూటనలుబదినాల్గు నోటికి తగిలించి
మాటలాడ వద్దంటాడు
మమ్ము పాట పాడ వద్దంటాడు
తనను దాటి వెళ్లవద్దంటాడు
అయ్యో! చేటు తెచ్చుక మమ్ము చెడిపోవమంటాడు
।।మాకొద్దీ।।

6. వాడి తాతగారి ముల్లె దాచిపెట్టినట్లు
ధాటీ చేస్తాడీ దేశమున
పోరాటమాడుతాడు పైన
మోమాటము పడడు సుంతైన
వాడి పాటు పాడైపోను మాటచెపితె వినడు
।।మాకొద్దీ।।



AP SCERT

సారాంశం



1. ఓ దేవా! భారతీయులమైన మా మానప్రాణాలను తీయడానికై అదనుకోసం చూసే తెల్లవారి (ఆంగ్లేయుల) ప్రభుత్వం మాకు వద్దే వద్దు.
2. పలు దేశాలలో పంటలు పండుతున్నాయి. కాని పట్టెడన్నానికి నోచుకోలేకపోతున్నాం. ఉప్పును ముట్టుకుంటే పరిహారం విధించి మా నోట్లో మట్టిగొడుతున్నారు. కుక్కలకు వేసే అన్నం కోసం వాటితో పోరాడి ఆకలి తీర్చుకోమంటున్నారు.
3. ధన సంపాదన కోసం కల్లు, సారాయి అమ్ముతున్నారు. ఆ నెపంతో దాచుకున్న డబ్బును దోచుకుంటున్నారు. భార్యల మెడలలో తాళిబొట్లు ఉండనీయడం లేదు. మా కళ్లుగప్పి ప్రాణాలకే ముప్పు తెస్తున్నారు.
4. గాంధీ టోపీ పెట్టుకొని పాఠశాలకు రావద్దంటున్నారు. బడిలో రాట్నం పెట్టవద్దంటున్నారు. తలపై టోపీ తీసివేసి వీపులపై బాదుతున్నారు. రాట్నం ఉపయోగించిన వారిని రాజద్రోహులుగా జమకడుతున్నారు.
5. నూట నలభై నాలుగవ సెక్షన్ చీటీని నోటికి తగిలించి మాట్లాడవద్దంటున్నారు. స్వాతంత్ర్యోద్యమ గీతాలు పాడవద్దంటున్నారు. వారి అనుమతి లేకుండా ముందుకు వెళ్లవద్దంటున్నారు. భారతీయులను బానిసలుగానే బతకమంటున్నారు.
6. వారి తాతలు సంపాదించిన ధనం మూట ఈ దేశంలో దాచిపెట్టినట్లు ఆంగ్లేయులు స్వదేశీయులమైన మామీద దాడి చేస్తున్నారు. అనవసరమైన జగడాలు పెట్టుకుంటున్నారు. ఏమాత్రం జంకు లేకుండా ఉన్నారు. మా మాట వినకుండా ఏకపక్షంగా అధికారం చెలాయించే వీరి అఘాయిత్యాలు ఆగిపోవాలి.

ఇవి చేయండి

ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.

ప్రాణం, హరియించు, పట్టెడన్నం, మూటాముల్లే, పుస్తెలు, పాఠశాల, ద్రోహం, రాట్నం, ధాటి, దేశం, పోరాటం, మోమాటం, సుంతైన.



అవగాహన - ప్రతిస్పందన

1. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడండి, అభినయించండి.
2. కింది వాక్యాలను చదవండి. వీటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి, రాయండి.

   అ) మా ధనం మూటలు దోచుకున్నాడు.

   ఆ) కీడుతో మమ్మల్ని చెడిపోమంటున్నాడు.

   ఇ) ఈ దేశం మీద దాడి చేస్తున్నాడు.

   ఈ) ఉప్పు తాకితే తప్పంట.

AP SCERT

3. **కింది ఖాళీలను సరైన గేయ భాగంతో పూరించండి.**

గాంధీ టోపీ పెట్టి .....

రావద్దు .....

రాట్నం బడిలో .....

..... వీపులు బాదుతాడు.

అయ్యో! ..... రాట్నంలో ఉన్నదంట.

4. **ఈ కింది కవితను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఏమి మహిమంబు గలదొ నీనామమందు
'బాపు' అనిపేరు వీనులబడిన యంత
నిలువునను నాదు మేనెల్ల పులకరించు
జల్లుమని నాదు హృదయంబు జలదరించు
సర్వసారస్వత ప్రపంచంబు నందు
గాంధి యనియెడి వర్ణయుగంబు తోడ
సాటి వచ్చెడు వేరొక్కమాట గలదె – నాళం కృష్ణారావు

అ) ఏ పేరులో గొప్పతనం ఉందని కవి అభిప్రాయం?

ఆ) ఈ కవితను రచించిన కవి ఎవరు?

ఇ) బాపు అనే పేరు ఎవరికి సంబంధించినది?

ఈ) ఈ కవిత ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. మాకొద్దీ తెల్ల దొరతనం గేయ కవిని గురించి రాయండి.
2. మాకొద్దీ తెల్ల దొరతనం అని కవి ఎందుకన్నాడు?

ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.

1. ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని భారతీయులు వద్దనడానికి గల కారణాలను గేయం ఆధారంగా వివరించండి.
2. పిల్లల చేత వెట్టిచాకిరి చేయించడం నువ్వు చూసావా? అటువంటి వారికి విముక్తి కలిగించడానికి మీరైతే ఏం చేస్తారో రాయండి.
3. ఆంగ్లేయుల పై భారతీయుడు చేసిన పోరాటాన్ని ప్రశంసిస్తూ ఒక పేరా రాయండి.

AP SCERT



భాషాంశాలు

i. పదజాలం

అ) కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.

ఉదా॥ తెల్ల దొరతనం లో స్వేచ్ఛ ఉండదు.

తెల్ల దొరతనం = తెల్లవారి పాలన.

తెల్లవారి పాలనలో ప్రజలు అనేక కష్టాలకు గురి అయ్యారు.

1. కూడు లేని పేదలను ఆదరించాలి.

   .....

2. సొంత లాభం సుంతైన మానుకొని పొరుగువారికి తోడుపడాలి.

   .....

3. వాడి తాతగాడి ముల్లె దాచిపెట్టినట్లు.


   .....

ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు (పర్యాయపదాలు) గుర్తించి రాయండి.

1. చేటు కలిగించే పనులు చేయకూడదు. అవి జీవితానికి ఎంతో కీడు చేస్తాయి.
2. విజయనగర రాజు కృష్ణదేవరాయలు. ఆ ప్రభువు తెలుగుభాషను ఎంతగానో ఆదరించాడు.
3. అధికారం కోసం పోరాటం, ఆస్తుల కోసం యుద్ధం చేయడం మంచిది కాదు.

ఇ) కింది పదాలను సరైన వ్యతిరేకార్థక పదాలతో జతపరచండి.

1. కావాలి ( ) అ) చెడు
2. మంచి ( ) ఆ) వినడు
3. వింటాడు ( ) ఇ) వద్దు



ii. వ్యాకరణాంశాలు

లింగము మరియు వచనం – వాక్య నిర్మాణానికి పునాదులు

మనం అక్షరాల గురించి నేర్చుకున్నాం. వాక్యాలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి మనకు ఇంకా కొన్ని ముఖ్యమైన విషయాలు తెలియాలి.

"వాడితాతగారి ముల్లె దాచిపెట్టినట్లు" – ఈ వాక్యం వినగానే మనకు ఏం **అర్థమవుతోంది?**

- ఉన్నది **'మగవాడు'** అని.
- ఉన్నది **'ఒకరే'** అని.

పై పదాలలో **'ఒకరు'**, **'మగవాడు'** అని మనకు ఎలా తెలిసింది, అంటే ఆ పదాల అర్థాలను బట్టి తెలుస్తుంది. అనే విషయాన్నే ఇప్పుడు పరిశీలిద్దాం!

APSCERT

విభాగం 1: లింగము – ఇది 'జాతి'కి సంబంధించినది

'లింగము' అంటే 'గుర్తు'. ఒక పదం (నామవాచకం) **పురుష, స్త్రీ, భిన్నమైన** వాటిని తెలిపే దానిని **లింగము** అంటారు.

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!

ఈ మూడు పదాలను చూడండి :

1. రాముడు 2. సీత 3. చెట్టు

- రాముడు అనగానే **'మగ' (పురుష)** జాతి అని తెలుస్తోంది. దీన్ని **మహద్వాచకము** అంటారు.
- సీత అనగానే **'ఆడ' (స్త్రీ)** జాతి అని తెలుస్తోంది. దీన్ని **మహతీ వాచకము** అంటారు.
- చెట్టు అనగానే అది ఇతరమైనది (ప్రాణం ఉన్నా, వ్యాకరణం ప్రకారం) అని తెలుస్తోంది. దీన్ని **అమహద్వాచకము** అంటారు.

ఈ భేదం ఆధారంగా, తెలుగులో లింగము 3 రకాలుగా ఉంటుంది :

1. మహద్వాచకము

'పురుష' జాతిని తెలిపే పదాలను మహద్వాచకాలు అంటారు. సంస్కృతం భాషలో దీనికి పుంలిగము అని పేరు.

ఉదా : రాజు, తమ్ముడు, అతడు, దేవుడు.

2. మహతీ వాచకము

'స్త్రీ' జాతిని తెలిపే పదాలను మహతీ వాచకాలు అంటారు. సంస్కృతం భాషలో దీనికి స్త్రీలింగం అని పేరు.

ఉదా : రాణి, అమ్మ, ఆమె, దేవత.

3. అమహద్వాచకము

మహత్తులు, అమహత్తులు కాని వాటిని **అమహద్వాచకాలు** అంటారు. **ఎక్కువగా ప్రాణం లేని వస్తువులను, జంతువులను, పక్షులను ఇందులో చేర్చుతాం. సంస్కృతం భాషలో దీనికి నపుంసక లింగం అని పేరు.**

ఉదా : పుస్తకం, బల్ల, బంతి, కుర్చీ.

తెలుగులో లింగము (వాచకం) అర్థాన్ని ఆశ్రయించి ఉంటుంది. సంస్కృతంలో శబ్దాన్ని ఆశ్రయించి ఉంటుంది.

విభాగం 2: వచనం – ఇది 'సంఖ్య'కు సంబంధించినది.

'వచనం' అంటే **'చెప్పడం'**. ఒక పదం **'ఒకటి'** గురించి చెబుతుందా, లేక **'చాలా' (ఎక్కువ)** గురించి చెబుతుందా అని చెప్పేదే **వచనం**.

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం!

ఈ రెండు పదాలను చూడండి:

1. పుస్తకము 2. పుస్తకములు

- పుస్తకము అనగానే **'ఒకటే'** అని తెలుస్తోంది.
- పుస్తకములు అనగానే **'ఒకటి కంటే ఎక్కువ' (చాలా)** అని తెలుస్తోంది.

ఈ భేదం ఆధారంగా, తెలుగులో వచనం 2 రకాలు :

AP SCERT

1. ఏకవచనం

- **'ఏక'** అంటే **'ఒకటి'**. ఒక వస్తువును లేదా వ్యక్తిని మాత్రమే సూచించే పదం.

  ఉదా : బంతి, పాట, అతడు, చెట్టు.

2. బహువచనం

- **'బహు'** అంటే **'చాలా'**. ఒకటి కంటే ఎక్కువ వస్తువులను లేదా వ్యక్తులను సూచించే పదం.

  ఉదా: బంతులు, పాటలు, వారు, చెట్లు.

లింగం, వచనం

అభ్యాసం 1 :

పాఠంలోని ఈ పదాలను గమనించండి :

1. **"వాడు"** – ఇది పురుషుడిని సూచిస్తుంది. – ఇది **మహద్వాచకము.**
2. **"ఆమె"** – ఇది స్త్రీని సూచిస్తుంది. – ఇది **మహతీవాచకము.**
3. **"టోపి"** – ఇది వస్తువు. – ఇది **అమహద్వాచకము.**

మీరు చేయవలసింది:

ఇప్పుడు మీరు గేయం నుండి మరియు కవి పరిచయం నుండి తీసుకున్న ఈ కింది పదాలు ఏ లింగమో గుర్తించి పట్టికలో రాయండి.

పదం	మహత్తులు/అమహత్తులు/మహతీ
ఉదా: గాంధీ	మహద్వాచకం
తాతగారు	
పాఠశాల	
నది	
రచయిత్రి	
రాట్నం	

అభ్యాసం 2: వచనం పరిశీలన

ఈ క్రింది పదాలను పరిశీలించి ఏకవచనం మరియు బహువచన పదాలను వేరు చేసి వ్రాయండి

పాఠశాల, ప్రాణాలు, టోపీ, కష్టాలు, దేశం, పాటలు, రాట్నం, వీపులు, మాట, పుస్తెలు, భారతీయులు, గేయం

ఏకవచనం (ఒకటి)	**బహువచనం (అనేకం)**
పాఠశాల	ప్రాణాలు

AP SCERT

అభ్యాసం 3 : వచనం మార్చుదాం!

ఈ కింది ఏకవచన పదాలను గమనించండి. వీటికి బహువచన రూపం ఏమిటో ఆలోచించి వ్రాయండి.

ఏకవచనం	బహువచనం
మాట	మాటలు
పాట	.....
దేశం	.....
కష్టం	.....
పుస్తె	.....
గేయం	.....

ఈ క్రింది బహువచన పదాలకు ఏకవచనం వ్రాయండి

1. మల్లెలు ..... 2. కళ్లు ..... 3. వీపులు.....
4. ప్రాణాలు..... 5. బడులు.....

ప్రాజెక్టుపని **(ఇది రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం)**

స్వాతంత్ర్యోద్యమ గీతాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.



చమత్కార పద్యం

కరయుగంబు గలదు చరణంబు లా లేవు
కడుపు, నడుము వీపు మెడయుగలవు
శిరము లేదుగాని నరులబట్టుక మ్రింగి
సాగసు గూర్చు దీని సాగసు గనుడి





నేనివి చేయగలనా?



1.	పాఠంలోని గేయాన్ని రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను.	ఔను / కాదు
2.	గేయసారాంశాన్ని సొంత మాటలలో చెప్పగలను, రాయగలను.	ఔను / కాదు
3.	పాఠంలోని లింగ వచన భేదాలను గుర్తించగలను.	ఔను / కాదు
4.	పాఠంలోని పదాలతో కొత్త గేయం రాయగలను.	ఔను / కాదు

దేశం కోసం చనిపోయేవారు ఎల్లకాలం ఈ భూమిపై బతికే ఉంటారు.

– భగత్ సింగ్


AP SCERT



చదవండి - ఆనందించండి

నేతాజీ

నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒక ప్రముఖ నాయకుడు మరియు గొప్ప దేశభక్తుడు. ఆయన తన అద్భుతమైన వాగ్ధాటితో మరియు నాయకత్వ పటిమతో లక్షలాది మంది భారతీయులను ఉత్తేజపరిచారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అన్న ఆయన పిలుపు దేశవ్యాప్తంగా ఒక కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆయన బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలను సమీకరించడంలో కీలక పాత్ర పోషించారు.



ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, ఒక గొప్ప సైనిక వ్యూహకర్త కూడా. భారత స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం అవసరమని భావించి, ఆయన భారత జాతీయ సైన్యాన్ని (ఆజాద్ హింద్ ఫౌజ్) ఏర్పాటు చేశారు. ఆయన నాయకత్వంలోని సైన్యం బ్రిటిష్ సైన్యంతో వీరోచితంగా పోరాడింది. ఆయన ధైర్యం మరియు సంకల్పం వేలాది మంది సైనికులకు స్ఫూర్తినిచ్చింది.

నేడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రతి భారతీయుని హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన త్యాగం మరియు దేశభక్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆయన విగ్రహాలు మరియు స్మారక చిహ్నాలు ఆయన ఘనమైన వారసత్వానికి నిదర్శనం. **ఆయన జయంతిని మనం పరాక్రమ దినోత్సవంగా (23 జనవరి)** జరుపుకుంటాము.

భారతదేశానికి స్వాతంత్రం రావడానికి సుభాష్ చంద్రబోస్ సారథ్యంలో ఉన్న **ఆజాద్ హింద్ ఫౌజ్** కూడా కారణమైంది. సుభాష్ చంద్రబోస్ ఇచ్చినటువంటి **జైహింద్** అనే నినాదం భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

స్వాతంత్ర్యం అంటే బానిసత్వం నుంచి విడుదలే కాదు, కుల, మత సాంఘిక అసమానతలను తొలగించడం, వైషమ్యాలను నశింపజేయడం. **- సుభాష్ చంద్రబోస్**

APSCERT

4. సమయస్ఫూర్తి (గద్యభాగం)

G8Z3L7

అభ్యసన ఫలితాలు :

1. అపాయం వచ్చినప్పుడు ఉపాయంతో ఎలా తప్పించుకోవాలో తెలుసుకుంటారు.(పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
2. ఎలుక – పిల్లి మాటలను సంభాషణ రూపంలో నాటకీకరణ చేయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2)
3. కథలోని పాత్రలు-స్వభావం చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3)
4. కథాసమీక్షను చదివి, దానిని అనుసరించి మరొక కథాసమీక్ష రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-4)
5. విభక్తి ప్రత్యయాలను సోదాహరణంగా తెలుసుకుంటారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)



వినడం – ఆలోచించి మాట్లాడడం



1. చిత్రాలు చూడండి. కథను ఊహించి చెప్పండి.
2. కోతి లేకపోతే కోడి ఎలా తప్పించుకునేదో ఊహించి చెప్పండి.

ఉద్దేశం: ప్రపంచ ప్రసిద్ధిచెందిన కథలు పంచతంత్ర కథలు. మొదట సంస్కృతభాషలో విష్ణుశర్మ అనే పండితుడు ఈ కథలను రచించారు. పరవస్తు చిన్నయసూరి తెలుగులోకి పంచతంత్రాన్ని 'నీతిచంద్రిక' పేరుతో అనువదించారు. ప్రతి వ్యక్తి సమయోచిత ప్రతిభని కనపరచి ఆపదల నుండి తప్పించుకోవాలనీ, మోసపు మాటల్ని నమ్మకూడదనీ తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

రచయిత పరిచయం

కందుకూరి వీరేశలింగం (16.4.1848 – 27.5.1919)



రాజమండ్రిలో జన్మించారు. 'రాజశేఖర చరిత్రము', 'సత్యరాజా పూర్వదేశ యాత్రలు', 'హాస్య సంజీవని', 'సతీహిత బోధిని', 'ఆంధ్రకవుల చరిత్ర', మొదలైనవి వీరి రచనలు. వీరు సంఘసంస్కర్త, నవయుగ వైతాళికులు, విద్యావేత్త. 'గద్యతిక్కన' ఆయన బిరుదు. ఈ పాఠానికి మూలం కందుకూరి వీరేశలింగం అనువదించిన పంచతంత్ర కథలలోని 'విగ్రహం' అనే భాగంలోని కథ.

© NCERT

సమయస్ఫూర్తి



పంచవటం (ఐదు మర్రి చెట్ల సమూహం) అనే ప్రాంతంలోని ఒక మర్రిచెట్టు తొర్రలో "రోమశుడు" (పిల్లి) నివసిస్తున్నాడు. ఆ చెట్టు క్రింది కన్నంలో "పలితుడు" (ఎలుక) కాపురం ఉంటున్నాడు. ఒకనాటి రాత్రి వేటగాడు అక్కడికి వచ్చి, ఆ చెట్టు చుట్టూ వలపన్నాడు. అది తెలియని రోమశుడు తెల్లవారుతూనే మసక చీకటిలో ఆహారాన్వేషణకు బయలుదేరి ఆ వలలో చిక్కుకున్నాడు. ఇది చూసిన పలితుడు "ఆహా! ఎంత అదృష్టము. నా శత్రువు వలలో చిక్కుకున్నాడు. ఈనాటితో వాడి పీడ..." అనుకున్నాడు.

ఇదే సమయంలో "చంద్రకుడు" (గుడ్లగూబ) హాయిగా విహరిస్తున్న పలితుడ్ని చూసి అక్కడకు వచ్చాడు. చంద్రకుని చూసి పలితుని గుండె గుభేలుమంది. అయిపోయింది నాపని అనుకున్నాడు. ప్రాణభీతితో గిజగిజలాడాడు. "ఏం చెయ్యనురా దేవుడా" అంటూ చెప్పుకోలేని దీనావస్థతో మనసులో ఏడుస్తున్నాడు. అందుకనే కాబోలు "ఒకరి కష్టాన్ని చూసి సంతోషించి చంకలు కొట్టుకోరాదన్నది" అని పలితుడు మనసులో బాధపడ్డాడు. 'ఐనా బుద్ధిమంతులు ప్రమాదం ఎదురైనప్పుడు ధైర్యమొందుతారు. కానీ అయ్యో! నా ప్రాణం పోతుందని ఏడవరు' అని పలితుడు ధైర్యం తెచ్చుకున్నాడు. "ఎంతయినా ఒకచోట బ్రతుకుతున్న వాళ్ళం కాబట్టి ఈ రోమశుని అర్థించి ప్రాణాలు నిలబెట్టుకుంటాను" అని అనుకొని నెమ్మదిగా రోమశుని వైపు అడుగులు వేశాడు...

"మిత్రమా! నమస్కారం. జాతివైరమున్నా శత్రు మిత్రులము. చాలా సంవత్సరాల నుండి ఈ చెట్టు వద్దనే బ్రతుకుతున్నాము. ఒకరికొకరు అపకారం చేసుకోలేదు. ప్రస్తుతం కష్టకాలం వచ్చింది. కావున శత్రువులం అనుకోకుండా పరస్పరం సహకరించుకొని ఈ ఆపద నుండి బయటపడదాం. కానీ తీరా నీ వలతాళ్ళు కొరికి నిన్ను రక్షిస్తే గుటుక్కున మింగేస్తావేమోనని భయంతో కాసేపు వెనకడుగు వేసి అనవసర ఆలోచన చేశాను. కానీ తెలియనిదాని నోట్లోపడి దిక్కులేని చావు చచ్చేకన్నా నీకు ఉపకారం చేసి ఇద్దరమూ స్నేహంగా ఉందామని, కాదంటే నీకాహారం అయిపోదామని తెగించి వచ్చాను. ప్రాణభీతితో కాదు, ప్రాణ స్నేహం కోసం తహతహలాడుతూ..."



AP SCERT

అంతా విన్న రోమశుడు ఆనందపరవశుడయ్యాడు. అతనికి భయం లేకపోవడానికీ, అతని ఆలోచనలకూ సంతోషించాడు. ధర్మబుద్ధిని మెచ్చుకుంటూ ఇలా పలికాడు. "మిత్రమా! జీవితం చివరిదశలో ఉన్నాను. నీవు చెప్పినట్లే నడుచుకుందాము. నీవు త్యాగబుద్ధితో నన్ను రక్షించదలచావు, నీకు కృతజ్ఞతలు. నేను కూడా చాలా రోజులనుండి నీతో స్నేహంగా ఉండాలనే అనుకుంటున్నాను. నీ సదాలోచన నాలోని అజ్ఞానాన్ని పటాపంచలు చేసింది. ఆ చంద్రకుడు నిన్నేమీ చేయలేడు. నీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డువేస్తాను".



వారిద్దరూ అలా సఖ్యంగా మాట్లాడుకోవడం చూసిన చంద్రకుడు వారి మైత్రికి భయపడి, తన పథకం పారదని నిరాశతో తన దారిన తాను పోయాడు. వేటగాడు వలలో చిక్కుకున్న పిల్లి కోసం వేటకుక్కలతో వస్తున్నాడు. అది చూసిన రోమశుడు "మిత్రమా! పలితుడా! ఆ కిరాతుడు కాలయముని లా వస్తున్నాడు. నన్ను తొందరగా రక్షించు" అన్నాడు. పలితుడు తెలివిగా వల కొరుకుతున్నట్లు నటిస్తూ, వేటగాడు దగ్గరికి వచ్చేసరికి పుటుక్కున వల కొరికి, రోమశుడు పోయే దారిచేసి తన కన్నంలోకి చటుక్కున పరుగెత్తాడు. రోమశుడు "బ్రతుకుజీవుడా" – అంటూ పుటుక్కున చెట్టెక్కాడు. వేటగాడు పిల్లి చేజారిపోయిందని విచారిస్తూ వెనుదిరిగాడు.



కొంతసేపటికి రోమశుడు మెల్లగా చెట్టుదిగాడు. స్వజాతిబుద్ధితో, కపటంతో పలితుని ఉద్దేశించి "మిత్రమా! బయటికిరా! మరో ఉద్దేశం లేదు. నన్ను నమ్ము, కలిసిమెలసి బతుకుదాం. ఆనందంగా ఉందాం" అని పిలిచాడు. తెలివైన పలితుడు కనిపించీ కనిపించకుండా కన్నంలోంచి తల బయటకు పెట్టాడు. తొందరపడి బయటకు రాకుండా ఇలా అన్నాడు. "మిత్రమా! చాలా సంతోషం. ఇందాకటి అవసరం ఇద్దరిదీ అయింది. ఆ ప్రాణభయం ఇద్దరిది. అందుచేత నిన్నాశ్రయించాను. ఇందులో మోసం, దగా, కుట్రా ఏదీ లేదు. అంతా సత్యమే. జరిగింది. ఇరువురకు లాభమే జరిగింది. ఎవరి ప్రాణాలు వారికి దక్కాయి. కాని నిజానికి జాతిలక్షణం కాదనలేని వైరలక్షణం. బయటకు వచ్చాననుకో నాకు ప్రాణగండం తప్పదని తెలుసు" అని పలికి కన్నంలోకి దూరి మాయమయ్యాడు. ఎలుక రాకపోయేసరికి రోమశుడు నిరాశపాలయ్యాడు. కథ సుఖాంతమయ్యింది.

APSCERT

ఇవి చేయండి

ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.

ఆహారాన్వేషణ, అదృష్టం, చంద్రకుడు, విహరిస్తున్న, ప్రాణభీతి, దీనస్థితి, ధైర్యము, బ్రతుకుతున్న, ప్రాణాలు, ప్రస్తుతం, శత్రువులు, పరస్పరం, గుటుక్కున, కృతజ్ఞతలు, అజ్ఞానం, ఆశ్రయించాను.



అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని కథను మీ సొంతమాటల్లో చెప్పండి.
2. గుడ్లగూబను చూచి భయపడిన ఎలుక తన మనస్సులో ఏమనుకొంది?
3. ఎలుక, పిల్లినుండి ఎలా తప్పించుకుంది?
4. **కింది పేరా చదివి ప్రశ్నలకు సరైన జవాబులు ఎంపిక చేయండి.**



మనం మంచివారితో స్నేహం చేస్తే మంచి అలవాట్లు వస్తాయి. చెడ్డవారితో స్నేహం చేస్తే చెడు అలవాట్లు అబ్బుతాయి. అవి మన జీవితాన్ని మార్చేస్తాయి. అందుకనే స్నేహితులను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఎంచుకోవాలి. చక్కగా చదువుకొని బుద్ధిగా ఉండే పిల్లలతో స్నేహం చేయడం వలన వారుకూడా జీవితంలో మంచి స్థానం సంపాదించుకుంటారు. చదువుమీద శ్రద్ధలేని, బాధ్యతలేని పిల్లలతో స్నేహం చేయడం వల్ల చదువూ, సంధ్యా లేకుండా సోమరుల్లా మిగిలిపోతూ ఉంటారు. మనం తిరిగే, మాట్లాడే స్నేహితులవల్ల మన స్వభావం గుణగణాలు ఎదుటివారికి తెలుస్తాయి. కష్టసమయాల్లో మంచి స్నేహితులు మనకు తోడుగా ఉంటారు.

అ) మనం ఎటువంటివారితో స్నేహం చేయాలి? ( )

ఎ) చెడ్డవారితో బి) మంచి వారితో

సి) చదువు మీద శ్రద్ధ లేని వారితో డి) బాధ్యత లేని వారితో

ఆ) ఏ విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి? ( )

ఎ) స్నేహితులను ఎంచుకోవడంలో బి) ఆటలలో

సి) ఖర్చు చేయడంలో డి) చదువుకోవడంలో

ఇ) కష్ట సమయాల్లో మంచి స్నేహితులు ఎలా స్పందిస్తారు? ( )

ఎ) పట్టించుకోరు బి) తోడుగా ఉంటారు

సి) మౌనంగా ఉంటారు డి) కఠినంగా ఉంటారు

APSCERT

ఈ) జీవితంలో మంచి స్థానం సంపాదించుకోవడానికి మీరేమి చేస్తారు ? ( )

ఎ) బుద్ధిగా ఉండే పిల్లలతో స్నేహం చేయడం

బి) సోమరులతో కలిసి ఉండటం

సి) చదువు మీద శ్రద్ధలేనివారితో తిరగడం

డి) బాగా డబ్బు సంపాదించడం



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

1. సమయస్ఫూర్తి పాఠ్యభాగ కవిని గురించి రాయండి.
2. ఈ కథలో నీవు తెలుసుకున్న నీతి ఏమిటి?

ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.

1. సమయస్ఫూర్తి కథను సొంత మాటలలో రాయండి.
2. ఎలుక తెలివితేటలను గురించి మీరేమనుకుంటున్నారో రాయండి.
3. మీ సమయస్ఫూర్తితో మీ స్నేహితుని గాని, స్నేహితురాలిని గాని, ఆపదలో ఉన్న వారిని ఎవరైనా రక్షించిన వివరాలను వ్రాయండి.
4. ఎలుక – పిల్లి మాటలను సంభాషణ రూపంలో రాయండి.
5. కింది కథా సమీక్షను చదివి నీకు నచ్చిన కథకు సొంతంగా కథా సమీక్ష రాయండి.



కథాసమీక్ష

కథ పేరు : సమయస్ఫూర్తి

పుస్తకం పేరు : 6వ తరగతి తెలుగు వాచకం

కథా రచయిత : గద్య తిక్కన కందుకూరి వీరేశలింగం.

కథలో ప్రధాన పాత్రలు : పలితుడు (ఎలుక): చాలా తెలివిగా, ధైర్యంగా ఉంటాడు. తన శత్రువైన పిల్లిని కూడా తనకు అనుకూలంగా ఉండేలా మలచుకొంటాడు.

రోమశుడు (పిల్లి) : దుష్టపాత్ర. మోసకారి. తన ప్రయోజనం కోసం ఎవరినైనా మోసం చేస్తాడు.

చంద్రకుడు (గుడ్లగూబ) : పలితుడ్ని తినాలని వచ్చిన శత్రువు.

వేటగాడు: రోమశుణ్ణి పట్టుకోవడానికి కుక్కలతో వస్తాడు. అతను కథలో కనిపించే ఒక పాత్ర మాత్రమే.

కథాసారాంశం :

రోమశుడు వలలో చిక్కుకుంటాడు. అది చూసి పలితుడు ఆనందపడతాడు. అంతలో చంద్రకుడు వచ్చి పలితుడిని భయపెడతాడు. సమయాన్ని బట్టి పలితుడు– రోమశుడి తో మాట్లాడతాడు. అది చూసి చంద్రకుడు అక్కడినుండి వెళ్ళిపోతాడు. ఆ సహాయానికి కృతజ్ఞతగా పలితుడు రోమశున్ని వేటగాడి నుంచి రక్షిస్తాడు. ఇరువురు వారి వారి స్థానాలలో సుఖంగా ఉంటారు.

AP SCERT

ఆపద తొలగిపోయిన తర్వాత, రోమశుడు తన సహజ బుద్ధిని చూపిస్తూ ఫలితుని బయటికి రా! మిత్రమా స్నేహంగా ఉందాం అంటాడు. కానీ తెలివైన పలితుడు– రోమశుడి ఆలోచనను పసిగట్టి బయటికి రాకుండా చక్కని సమాధానం చెప్పి తప్పించుకుంటాడు.

నీతి : ఆపద సమయాలలో ధైర్యంగా ఉంటూ, తెలివిగా ఆలోచించి,అవసరమైతే శత్రువునైనా ఉపయోగించుకోవాలి, శత్రువుకైనా ఉపయోగపడాలి. అలా అని అతనితో శాశ్వత స్నేహం చేయకూడదు. సమయస్ఫూర్తి (సరైన సమయంలో తెలివిగల పని) చాలా ముఖ్యం.

కథలో నాకు నచ్చిన అంశాలు : జంతువులకి మానవుడి లాగా పేర్లు పెట్టి సంభాషింప చేయడం నాకు బాగా నచ్చింది. చిన్నదైన ఎలుక–పిల్లిని తెలివిగా బోల్తా కొట్టించడం నాకు బాగా నచ్చింది. దీన్నిబట్టి నేను కూడా సమయానుకూలంగా తెలివిగా ఉండాలనే విషయం నేర్చుకున్నాను.



భాషాంశాలు

i. పదజాలం

అ) గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.

ఉదా॥ ఎలుక ఆహారం అన్వేషించడానికి బయలుదేరింది. .....

1. చిలుక ప్రాణభీతితో గిజగిజలాడింది. .....
2. చిరకాల వైరం మంచిది కాదు. .....
3. మంచివారితో మైత్రి గొప్ప జీవితానికి మార్గం చూపుతుంది. .....
4. సదాలోచనలు చేయాలి. .....
5. పిల్లికి ఎలుకకు జాతి వైరం ఉంది.

అ) శత్రుత్వం ఆ) స్నేహం ఇ) కోపం ఈ) సహనం

ఆ) కింది పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.

1. అదృష్టం × 4. అపకారం ×
2. మంచి × 5. ధర్మం ×
3. వెలుగు × 6. సత్యం ×

ఇ) కింది ప్రకృతి వికృతులను జతచేయండి.

1. ఆహారం ( ) అ) పానం
2. ధర్మం ( ) ఆ) సంతసం
3. ప్రాణం ( ) ఇ) కత
4. కథ ( ) ఈ) దమ్మం
5. సంతోషం ( ) ఉ) ఓగిరం

- సంస్కృత, ప్రాకృత భాషల నుండి వచ్చి స్థిరపడ్డ పదాలను **ప్రకృతులు (తత్సమాలు)** అంటారు.

  వాటినుండి పుట్టిన పదాలను **వికృతులు (తద్భవాలు)** అంటారు.

AP SCERT

ii. వ్యాకరణాంశాలు

విభక్తులు – ఇది బట్టీ పట్టే పట్టిక కాదు!

(**"వాక్య నిర్మాణం"** మరియు **"పదభాగాలు"** అర్థం చేసుకోవడం)

మనం అక్షరాలు (అ, క, చ...) నేర్చుకున్నాం. కానీ ఆ అక్షరాలతో ఏర్పడిన పదాలు వాక్యంలో ఎలా కలిసి పనిచేస్తాయో ఎప్పుడైనా గమనించారా?

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం! (ప్రాయోగిక పద్ధతి)

కింది వాక్యాలు చదవండి. మీకు ఏదైనా తేడాగా అనిపిస్తోందా? గమనించండి.

- రాముడు బడి వెళ్ళాడు.
- రవి కత్తి కూరగాయలు కోశాడు.
- చెట్టు పండు పడింది.

ఈ వాక్యాలకు సరైన అర్థం రావడం లేదు కదూ! ఎందుకు రావడం లేదు జాగ్రత్తగా గమనించండి. ఇప్పుడు మళ్ళీ చదవండి:

- రాముడు బడి**కి** వెళ్ళాడు.
- రవి కత్తి**తో** కూరగాయలు కోశాడు.
- చెట్టు **నుండి** పండు పడింది.

చూశారా! కి, తో, నుండి అనేవి చేరగానే వాక్యానికి పూర్తి అర్థం వచ్చింది. వీటిని **ప్రత్యయాలు** అంటారు. సాధారణంగా ఇవి శబ్దానికి చివర చేరతాయి. ఉదాహరణకు రామ శబ్దం. డు అనే ప్రత్యయం చేరితే **రాముడు** అవుతుంది. అదే తో చేరితే **రాముని**తో అవుతుంది.

విభక్తులు అంటే ఏమిటి?

వాక్యంలో ఒక పదానికి, మరో పదానికి మధ్య ఉన్న **సంబంధాన్ని** తెలిపి, వాక్యానికి పూర్తి అర్థాన్ని ఇచ్చే పదాలను/ప్రత్యయాలను **విభక్తులు** అంటారు.

- రవి కి కత్తి కి ఉన్న సంబంధం – తో (సాధనం)
- బడి కి వెళ్ళాడు కి ఉన్న సంబంధం – కి (గమ్యం)
- చెట్టు కి పడింది కి ఉన్న సంబంధం – నుండి (పతనం)

AP SCERT

విభక్తుల పట్టిక:

మన వ్యాకరణ వేత్తలు ఈ విభక్తులను, అవి చెప్పే అర్థాన్ని బట్టి 8 రకాలుగా విభజించారు. ఇది మనం బట్టీ పట్టడానికి కాదు, సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక ఆధారం.

విభక్తి	ప్రత్యయాలు	వాడకం / అర్థం పరిశీలన)	ఉదాహరణ వాక్యం
ప్రథమా	డు, ము, వు, లు	పేరును (కర్తను) సూచిస్తుంది	**రాముడు** వచ్చాడు.
ద్వితీయా	నిన్, నున్, లన్, కూర్చి, గురించి	దేనిని? ఎవరిని? (కర్మ)	**పామును** చూశాడు. **నీ గురించి** చెప్పాడు.
తృతీయా	చేతన్, చేన్, తోడన్, తోన్	దేనితో? ఎవరితో? (సాధనం)	**కత్తితో** నరికాడు. **రాముని చేత** చెప్పించాడు.
చతుర్థీ	కొఅకున్ (కోసం) కై (కయి)	ఎవరి కోసం? దేని కోసం?	**నీ కొరకు** తెచ్చాను. (ప్రాచీన భాష) నీ కోసం తెచ్చాను (ఆధునిక భాష)
పంచమీ	వలనన్, కంటెన్, పట్టి, నుండి	ఎక్కడ నుండి? దేనికంటే?	**చెట్టు నుండి** పడింది. వాడు **నీ కంటె** పొడవు.
షష్ఠీ	కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్	ఎవరిది? దేనిది? (సంబంధం)	**కర్ణుని యొక్క** బాణం. **ఇంటి లోపల** ఉంది.
సప్తమీ	అందున్, నన్	ఎక్కడ? ఎప్పుడు? (స్థలం/సమయం)	**ఇంటి యందు** ఉన్నాడు. **ఆ సమయమందు**...
సంబోధనా ప్రథమా విభక్తి	ఓ, ఓయీ, ఓరీ, ఓసి	పిలుపు	**ఓ నాన్నా!** ఇటు రా.

సూచన: సంబోధన ప్రథమా విభక్తిలో ప్రత్యయాలు వాక్యంలో రావడం తప్పనిసరి కాదు. ఆ ప్రత్యయాలు లేకుండా కూడా వాక్యం ఉంటుంది. స్నేహితుడా, అన్నా, నాన్న, అమ్మా ..... ఇలా ఎదుటి వారిని సంబోధించే పదాలన్ని కూడా సంబోధనా ప్రథమా విభక్తి క్రిందకు వస్తాయి. వీటికి ముందు ఓ, ఓయి, ఓరి అనే ప్రత్యయాలు చేరవచ్చు లేదా చేరకపోవచ్చు.

ముగింపు

పిల్లలూ, చూశారా! మనం ఒక వ్యాసం వ్రాసేటప్పుడు లేదా మాట్లాడేటప్పుడు, ఈ విభక్తులను (తో బదులు లో వాడటం) తప్పుగా వాడితే, వాక్యం అర్థమే మారిపోతుంది. అందుకే, వాక్య నిర్మాణం అర్థం కావడానికి విభక్తులు చాలా ముఖ్యం!

AP SCERT

పరిశీలన : "విభక్తులు" అనే పేరెలా వచ్చింది? (ఇది ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవడానికి అవగాహన కోసం మాత్రమే)

విభక్తి :

మిత్రులారా, 'అచ్చులు', 'హల్లులు' పేర్ల వెనుక మహేశ్వర సూత్రాలు ఉన్నాయని చూశాం కదా. మరి "విభక్తి" అనే పేరు వెనుక ఏ శాస్త్రం ఉంది? ఇది కూడా చాలా ఆసక్తికరమైనదే!

ఈ పదం సంస్కృతం నుండి వచ్చింది. దీనిని మనం విడదీసి చూద్దాం :

వి + భక్తి = విభక్తి

- **వి (వి-)** అనేది ఒక ఉపసర్గ (పదానికి ముందు చేరే దానిని ఉపసర్గ అంటాం). దీనికి **"వేరుగా"**, **"ప్రత్యేకంగా"** లేదా **"విభజించి"** అని అర్థం.
- **భక్తి** అనే పదం **భజ్** అనే సంస్కృత ధాతువు నుండి వచ్చింది. **'భజ్'** అంటే **"విభజించడం"**, **"పంపకం చేయడం"** లేదా **"భాగం చేయడం"**.

అర్థం : "విభక్తి" అంటే **"విభజించి చెప్పడం"** లేదా **"వేరుగా చూపించడం"**.

వ్యాకరణంలో దాన్ని ఎలా అర్థంచేసుకోవాలి?

శబ్దానికి విభక్తి ప్రత్యయాలు చేరినప్పుడే అది పదం అవుతుంది. ఈ విభక్తి ప్రత్యయాలు చేరినప్పుడు ఆ పదం రకరకాల అర్థాలను బోధిస్తుంది. ఒక పదం ఉదాహరణకు **రాముడు** తీసుకోండి. ఈ పదానికి వివిధ విభక్తి ప్రత్యయాలు చేర్చి చూడండి.

- **రాముడు వచ్చాడు** – ఇక్కడ పదాన్ని **కర్తగా** చెప్పింది (ప్రథమా విభక్తి).
- **రాముని చూశాడు** – ఇక్కడ అదే పదం **కర్మగా** (ద్వితీయా విభక్తి).
- **రామునిచేత చెప్పించాడు** – ఇక్కడ అదే పదం **సాధనంగా అంటే కరణంగా**(చేత)(తృతీయా విభక్తి).
- **రాముని కొరకు(కోసం)ఇచ్చాడు**–ఇక్కడ అదే పదం **ఉద్దేశం**గా అంటే **సంప్రదానం**గా(చతుర్థీ విభక్తి)
- **రాముని వలన లాభం పొందాడు**–ఇక్కడ అదే పదం **ఆశ్రయం**గా అంటే **అపాదానం**గా(పంచమీ విభక్తి)
- **రామునియొక్క బాణం** – ఇక్కడ అదే పదం **సంబంధం**గా (యొక్క) (షష్ఠీ విభక్తి).
- **రాముని యందు మంచి గుణములు ఉన్నాయి** – ఇక్కడ అదే పదం **అధికరణం**గా అంటే ఆధారంగా (అందు)సప్తమీ విభక్తి.

ఇలా, ఒక పదం యొక్క అసలు రూపాన్ని, (శబ్దాన్ని) వాక్యంలో అది చేసే పనిని బట్టి **వేరువేరు పాత్రలుగా విభజించి చూపించే ప్రక్రియ** కాబట్టి, మన వ్యాకరణ వేత్తలు దీనికి "విభక్తి" అని ఎంతో అర్థవంతంగా పేరు పెట్టారు!

అభ్యాసం 1: 'ప్రత్యయం'ను పట్టుకోండి!

పాఠంలోని ఈ వాక్యాలను చదవండి. వాక్యాన్ని అర్థవంతంగా కలిపే 'విభక్తి ప్రత్యయం' గుర్తించి, కింద గీత గీయండి. అది ఏ విభక్తో రాయండి.

1. "మిత్రమా" నమస్కారం. (ఇక్కడ 'ఓ' లోపించింది) సంబోధన ప్రథమా విభక్తి.
2. ఆ చెట్టు క్రింద కన్నంలో "పలితుడు" నివసిస్తున్నాడు. .....
3. "నీకు కృతజ్ఞతలు." .....
4. ఇదే సమయంలో చంద్రకుడు అనే గుడ్లగూబ హాయిగా విహరిస్తున్న ఎలుకను చూసి అక్కడకు వచ్చాడు. .....

AP SCERT

5. పలితుడు ప్రాణభీతితో గిజగిజలాడాడు. .....

6. "నీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డువేస్తాను." .....

7. "ఆపద నుండి బయటపడదాం." .....

8. "ఏం చెయ్యనురా దేవుడా!" .....

అభ్యాసం 2: ఖాళీలను పూరించి, విభక్తిని గుర్తిద్దాం!

కింది వాక్యాలలో సరైన విభక్తి ప్రత్యయంతో ఖాళీని పూరించండి. ఆ వాక్యం ఏ విభక్తికి చెందుతుందో చివర ఖాళీలో రాయండి.

	ప్రత్యయం	విభక్తి
ఉదా : ప్రథమావిభక్తి: రోమశు"డు" అనే పిల్లి నివసిస్తున్నాడు.	(డు)	(ప్రథమా విభక్తి)
1. "ప్రాణ స్నేహం ..... తహతహలాడుతూ..."	(.....)	(..... విభక్తి)
2. "ని ..... రక్షిస్తే గుటుక్కున మింగేస్తావేమోనని..."	(.....)	(..... విభక్తి)
3. "కన్నం .....నుంచి తల బయటకు పెట్టాడు."	(.....)	(..... విభక్తి)
4. "పలితుడా"..... (!) అని రోమశుడు పిలిచాడు.	(.....)	(..... విభక్తి)
5. "దీనావస్థ..... మనసులో ఏడుస్తున్నాడు."	(.....)	(..... విభక్తి)
6. "వారి మైత్రి..... భయపడి..."	(.....)	(..... విభక్తి)

అభ్యాసం 3: పాత పాఠాలను పరిశీలిద్దాం! (పాఠాలు 1, 2, 3 నుండి)

పిల్లలూ, ఇప్పుడు మనం మన మొదటి మూడు పాఠాల్లో ("అమ్మ ఒడి", "తృప్తి", "మా కొద్దీ తెల్లదొరతనం") మనకు తెలిసిన 8 విభక్తి ప్రత్యయాలకు సంబంధించిన వాక్యాలను వెతుకుదాం. ఆ పాఠాల నుండి ఒక ఉదాహరణ వాక్యాన్ని వెతికి రాయండి.

విభక్తి	(ప్రత్యయం)	పాఠం 1, 2 లేదా 3 నుండి ఉదాహరణ వాక్యం (మీరు వెతికి రాయండి)
ప్రథమ	డు, ము, వు, లు	(ఉదా:) పూర్ణయ్యని బావగాడు అంటారు అందరూ.
ద్వితీయ	ని, ను, లన్ కూర్చి గురించి	
తృతీయ	చేతన్, చేన్, తోడన్, తోన్	
చతుర్థీ	కొరకు, కై (కోసం)	
పంచమీ	వలన, కంటే, పట్టి	
షష్ఠీ	కి, కు, యొక్క, లోన్, లోపల	
సప్తమీ	అందు, నన్	
సంబోధనా	ఓ, ఓయీ, ఓరీ, ఓసి!	

AP SCERT




చమత్కార పద్యం

"**ఎలుకలు తమ కలుగులోనికి ఏనుగునీడ్చెను**" అని కవికి ఒక సమస్యను ఇచ్చారు. కవి దానిని ఎలా పూరించాడో చూడండి.

ఇలలో నిద్దరు రాజులు
మలయుచుఁ జదరంగమాడి మాపటివేళన్
బలమెత్తికట్ట మరచిన
నెలుకలు తమ కలుగులోనికేనుగునీడ్చెన్.

ఇలలో ఇద్దరు రాజులు పట్టుదలతో చదరంగమాడుతున్నారు. రాత్రి అయింది. చదరంగం మీద బలాన్ని (పావులను) ఎలా ఉన్నవి అలానే వదిలేసి వెళ్ళారు. రాత్రికి ఎలుకలు వచ్చి ఏనుగు (పావు) ను తమ రంధ్రంలోకి ఈడ్చుకొని పోయాయి.



APSCERT



నేనివి చేయగలనా?



1.	పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థంచేసుకొని సొంతమాటలలో చెప్పగలను.	ఔను / కాదు
2.	పాఠంలోని మాండలిక పదాలను, పదబంధాలను వాక్యాలలో ఉపయోగించగలను.	ఔను / కాదు
3.	ఇటువంటి కథను మరొకటి చెప్పగలను.	ఔను / కాదు
4.	పాఠంలోని విభక్తులను గురించి చెప్పగలను.	ఔను / కాదు

విద్వాన్ సర్వత్ర పూజ్యతే
(విద్యావంతుడు అన్నిచోట్ల పూజింపబడతాడు)




చదవండి - ఆనందించండి

సమయానికి తగిన ఆలోచన

ప్రతిమనిషికి తెలివితేటలు వుండాలి. కేవలం తెలివిగలవాడైతేనే ప్రయోజనం లేదు. తెలివితేటలకు తోడు 'సమయస్ఫూర్తి' కూడా ఉండాలి. 'సమయస్ఫూర్తి అంటే సమయానికి తగ్గట్లుగా ఆలోచన చేయటం. ఇది నేర్చుకుంటే వచ్చేది కాదు. ఆయా పరిస్థితులకనుగుణంగా, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వ్యవహరించే విజ్ఞతనే సమయస్ఫూర్తి అంటారు. దీనికి సంబంధించిన ఒక కథను తెలుసుకుందాం.

ఒకానొక సమయంలో ఒక రాజు ఉండేవాడు. అతని ఆస్థానంలో ఒక తెలివి గల 'విదూషకుడు' ఉండేవాడు. రాజుగారు చికాకుగా ఉన్నప్పుడు చతుర సంభాషణలతో నవ్విస్తూ వుండేవాడు, ఆనందాన్ని అందిస్తూ వుండేవాడు. సమయ స్ఫూర్తిగా మాట్లాడి సలహాలనందిస్తుండేవాడు. రాజుగారికి ఆ విదూషకుడంటే అమితమైన గౌరవం, ప్రేమ ఉండేది.

రాజుగారికి వంకాయ కూర అంటే చాలా ఇష్టం. ఒకసారి రాజుగారు విదూషకుని పిలిచి 'వంకాయ వంటి కూరలేదోయి!' అన్నాడు. అప్పుడు విదూషకుడు "చిత్తం ప్రభూ!" "వంకాయవంటి కూరయు, శంకరుని వంటి దైవము లేదిలన్" అంటూ వంకాయను గురించి ఆశువుగా కవిత్వం చెప్పాడు. రాజు 'భేష్! భేష్!' అన్నాడు.



విదూషకుడు ఇంకా ఒక మెట్టు పైకిపోయి "కూరలలో వంకాయ రాజు వంటిది" అని పొగిడాడు. 'అది ఎట్లా?' అని ప్రశ్నించాడు రాజు. ''తమరే చూడండి! ప్రభూ! ఎంత గొప్పది కాకపోతే వంకాయ పై భాగమున కిరీటంలా ముచ్చిక ఏర్పాటు చేశాడు సృష్టికర్త" అంటూ వంకాయను రాజుకు చూపించాడు. "భలే! భలే! ఎంత బాగా చెప్పావ్!" అంటూ ఒక రత్నాలహారం విదూషకునికి బహుమానంగా ఇచ్చాడు.

ఆనాటి నుంచి వంకాయ కూరను ప్రతిరోజు తినేవాడు రాజు. "తినగతినగ గారెలు చేదు" అయినట్లుగా వంకాయకూర కూడా తినగా తినగా వెగటు వేసింది. పై పెచ్చు ఒళ్ళంతా దురదలు కూడా వచ్చాయి. ఆస్థాన వైద్యునికి చూపించారు. ఆయన పరీక్షించి, ఈ దురద వంకాయకూరను, అతిగా తినటం వలన వచ్చిందని తేల్చి చెప్పాడు వైద్యుడు. దాంతో రాజుగారు ఆగ్రహించి, విదూషకుని పిలిపించాడు.

"ఏమయ్యా! వంకాయ వంటి కూరలేదన్నావు! దాని నెత్తిన కిరీటం కూడా వుందన్నావు! అందువలన ఆ కూర తిన్నాను. దురదలు వచ్చాయి. బాధపడుతున్నాను. నీకు బుద్ధిలేదు" అని రాజుగారు కోపగించారు.

"చిత్తం ప్రభూ! వంకాయకూరను అతిగా తినగూడదని ఇంతకు పూర్వం విన్నవించాలనుకున్నాను. ఈ మధ్య సృష్టికర్తకు కూడా వంకాయ మీద కోపం వచ్చి దాని నెత్తి మీద మేకులు కొట్టాడు. చూడండి ప్రభూ!"అంటూ వంకాయ తొడిమకువున్న ముళ్ళను చూపించాడు.రాజుగారు ఆశ్చర్యపోయారు. విదూషకుని తెలివితేటలకు సమయస్ఫూర్తికి మెచ్చుకొని మరో రత్నాలహారమును విదూషకునికి బహూకరించారు.

ఈ కథ మనకు ఒక నీతిని బోధిస్తున్నది. తెలివితేటలకు సమయస్ఫూర్తి తోడైతే ఉన్నత పదవులలో వున్నవారి అనుగ్రహాన్ని, ప్రశంసలను అందుకోవచ్చును.

APCERT

5. సుభాషితాలు (పద్యభాగం)

W4R5H2

అభ్యసన ఫలితాలు :

1. శతక పద్యాలు వల్లె వేయగలరు అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)
2. వివిధ కవుల పద్యాలను భావసహితంగా,శ్రావ్యంగా పాడి అభినందిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-2)
3. పద్య భావాలను సొంత మాటల్లో చెప్పగలరు, రాయగలరు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-3)
4. సంధి నిర్వచనం,ఉత్వ సంధి వివరాలు గ్రహిస్తారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-5)
5. శతక పద్యాల ద్వారా, నైతిక విలువలు పెంపొందించుకుంటారు. (పాఠ్య ప్రణాళికా లక్ష్యం-1)





వినడం - ఆలోచించి మాట్లాడడం

కష్టపెట్టబోకు కన్నతల్లి మనస్సు
నష్టపెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా
లలిత సుగుణజాల తెలుగుబాల!

1. చిత్రంలో ఎవరున్నారు?
2. గురువుగారు శిష్యులకు ఎటువంటి పద్యాలు చెబుతున్నారు?
3. ఇలాంటి నీతి పద్యాలు మీకు తెలిసినవి చెప్పండి.

ఉద్దేశం: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

క్రమ సంఖ్య	కవి	కాలం	శతకం
1.	నార్ల చిరంజీవి	20వ శతాబ్దం	తెలుగుపూలు
2.	వేమన	17వ శతాబ్దం	వేమన శతకం
3.	కరుణశ్రీ	20వ శతాబ్దం	తెలుగుబాల శతకం
4.	తిక్కన	13వ శతాబ్దం	ఆంధ్రమహాభారతం
5.	పక్కి అప్పలనరసయ్య	17వ శతాబ్దం	కుమార, కుమారీ శతకాలు
6.	పోతులూరి వీరబ్రహ్మం	17వ శతాబ్దం	కాళికాంబ సప్తశతి
7.	మారద వెంకయ్య	16వ శతాబ్దం	భాస్కర శతకం
8.	కంచర్ల గోపన్న	17వ శతాబ్దం	దాశరథి శతకం

APSCERT

సుభాషితాలు



ఆ.వె. కడచి పోయి నట్టి క్షణము తిరిగిరాదు
కాలమూర కెపుడు గడపఁబోకు
దీపమున్న యపుడె దిద్దుకోవలె నిల్లు
విలువ దెలిసి చదువు తెలుగుబిడ్డ! (1)



ఆ.వె. భూమి నాది యన్న భూమి పక్కున నవ్వు
దానహీనుఁజూచి ధనము నవ్వు
కదన భీతుఁజూచి కాలుండు నవ్వును
విశ్వదాభిరామ వినుర వేమ! (2)



ఆ.వె. దొరలు దోచలేరు, దొంగ లెత్తుక పోరు
భ్రాతృజనము వచ్చి పంచుకోరు
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
లలిత సుగుణజాల తెలుగుబాల! (3)



కం. తనువున విరిగిన యలుఁగుల
ననువునఁబుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా (4)

© SCERT AP



కం. రోషావేశము జనులకు
దోషము, తలపోయ విపుల దుఃఖకరము నౌ;
రోషము విడిచిన యెడ సం
తోషింతురు బుధులు హితము దోప కుమారా! (5)




కం. మఱువ వలెఁ గీడు, నెన్నఁడు
మఱువంగా రాదు మేలు, మర్యాదలతో
దిరుగవలె సర్వ జనముల
దరిఁబ్రేమ మెలంగవలయు ధరణి కుమారీ! (6)



ఆ.వె. పుస్తకములు చదువ పూర్ణత్వమబ్బదు
హృదయసంపుటముల చదువవలయు
పారిశుద్ధ్యమొకటె పరమాత్మ చేర్చును
కాళికాంబ! హంస! కాళికాంబ! (7)

చ. సిరిగలవాని కెయ్యెడలఁ జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱిగుఱిగాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలంబగున్
వఱపున వచ్చి మేఘుఁడొక వర్షము వాడిన చేల మీఁదటం
గుఱిసినఁ గాక యంబుధులఁ గుర్వఁగ నేమి ఫలంబు భాస్కరా! (8)





ఉ. నోఁచిన తల్లిదండ్రికిఁ దనూభవుఁడొక్కఁడె చాలు మేటి చే
చాఁచనివాఁడు వేఱొకఁడు చాఁచిన లేదనకిచ్చువాఁడు నో
రాఁచి నిజంబకాని పలుకాడనివాఁడు రణంబులోన మేన్
దాఁచనివాడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ! (9)

APSCERT

శతకం: శతకం అంటే నూరు పద్యాల రచన. శతక పద్యాల చివర 'మకుటం' ఉంటుంది. ఇందులో పద్యాలు 'ముక్తకాలు'గా ఉంటాయి. అంటే ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్రభావం కలిగి ఉంటుంది. మకుటం ఉండటం వలన శతకకవి ఏ పద్య ఛందస్సును ఎన్నుకుంటాడో అదే ఛందస్సులో అన్ని పద్యాలు రాయవలసి ఉంటుంది.

సారాంశం

1. తెలుగుబిడ్డా! జరిగిపోయిన సమయం తిరిగిరాదు. కాబట్టి కాలాన్ని వృథాగా గడపకూడదు. అవకాశం ఉన్నప్పుడే పనులను చక్కగా చేసుకోవాలి. కాలం విలువ తెలుసుకొని చదువుకోవాలి.

2. ఓ వేమా! ఈ భూమి నాది అని అహంకారం ప్రదర్శించిన వాడిని చూసి భూమి పగలబడి నవ్వుతుంది. ఈ ధనం నాది అనే మమకారంతో దానం జోలికి పోనివాడిని చూసి ధనం నవ్వుతుంది. యుద్ధమంటే భయపడే పిరికివాడిని చూసి యముడు నవ్వుతాడు.

3. తెలుగుబాలా! విద్యాధనాన్ని దొరలు దోచుకోలేరు. దొంగలు ఎత్తుకు పోలేరు. అన్నదమ్ములు వచ్చి పంచుకోలేరు. ఈ విద్యాధనమే ప్రపంచ అభివృద్ధికి మూలం.

4. ఓ రాజా శరీరంలో బాణాలు గుచ్చుకుంటే ఉపాయంతో వాటిని తొలగించుకోవచ్చు. కాని అతి పరుషంగా మాట్లాడిన మాటలు మనస్సులో గుచ్చుకుంటే వాటిని తొలగించడానికి మనం ఎన్ని ఉపాయాలు చేసినా లాభం లేదు. అవి తొలగిపోవు.

5. ఓ కుమారా! రోషావేశాలు మనుషులకు పాపాన్ని అంటగడతాయి. ఇవే దుఃఖానికి మూలం. అట్టి గుణాలను విడిచిపెట్టిన వారిని పండితులు సైతం మెచ్చుకుంటారు.

6. ఓ కుమారీ! ఒకరు చేసిన కీడు మరచిపోవాలి. కాని ఇతరులు మనకి చేసిన మేలును ఎన్నడూ మరచిపోకూడదు. అందరిపట్ల అనురాగంగా, మర్యాదతో ప్రవర్తించాలి.

7. ఓ కాళికాంబా! పుస్తకాలు చదివినందు వల్ల పూర్ణత్వం లభించదు, మనసులో ఉండే భావాలను చదవాలి. పరిశుభ్రత మనలను పరమేశ్వరుని వద్దకు చేరుస్తుంది. పుస్తక జ్ఞానం కంటే ఎదుటి వారి హృదయాలను చదవటం ముఖ్యం. మనిషి మనసు, వాక్కు, కర్మ పరిశుద్ధంగా ఉండాలని భావం.

8. భాస్కరా! ధనవంతునికి మనం చేసే మేలు వ్యర్థం. పేదవారికి మేలు చేస్తే ప్రయోజనం కలుగుతుంది. వానలు లేక ఎండిపోతున్న చేల మీద మేఘుడు వర్షిస్తే ఫలితం ఉంటుంది కాని సముద్రం మీద కురిస్తే ప్రయోజనం ఉండదుకదా!

9. దయాసముద్రుడవైన ఓరామా! ఎవరి దగ్గరా చేయి చాపనివాడు, అడిగితే లేదనకుండా ఇచ్చేవాడు, నోరు తెరచి నిజం తప్ప అబద్ధం చెప్పనివాడు, యుద్ధంలో వెన్నుచూపనివాడు, అదృష్టవంతులైన తల్లిదండ్రులకు ఇటువంటి గొప్పవాడైన కొడుకొక్కడు చాలు.

AP SCERT

ఇవి చేయండి

ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.

పక్కున నవ్వు – భ్రాతృజనం – విశ్వ వర్ధనం – విరసంబైన – రోషావేశాలు – దుఃఖకరం – మాతృపూజ – అన్యకాంత – నిష్ఫలం – నెఱిగుఱి – తనూభవుడు – భద్రగిరి – దాశరథి – కరుణాపయోనిధి – అంబుధి – సత్ఫలం – వీరబ్రహ్మం – కరుణశ్రీ



అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని పద్యాలను రాగంతో, భావానికి తగినట్లుగా పాడండి.
2. ఎవరెవరిని చూసి నవ్వుతారని కవి అంటున్నాడు?
3. కీడు, మేలు గురించి కవి ఏమి చెప్పారు?
4. కింది పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

చెలిమి శిలాక్షర మెప్పుడు
అలుక జలాక్షరము సుజనులగు వారలకున్
చెలిమి జలాక్షర మెప్పుడు
అలుక శిలాక్షరము కుజనులగు వారలకున్



ప్రశ్నలు:

అ) చెలిమి ఎవరికి శిలాక్షరం?

.....

ఆ) కుజనులకు ఏది జలాక్షరం?

.....

ఇ) చెలిమికి – అలుకకు ఉన్న తేడాను గుర్తించండి.

.....

ఈ) ఈ పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

.....



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

1. "కాలం చాలా విలువైంది" ఎందుకో రాయండి.
2. 'విద్య గొప్పతనం' నాలుగు వాక్యాల్లో రాయండి.
3. శతక ప్రక్రియను గురించి రాయండి.
4. సుభాషితాలు పాఠ్యభాగ ఉద్దేశం రాయండి.

AP SCERT

ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.

1. ఎటువంటి వారికి సహాయం చేయాలి? ఈ విషయాన్ని కవి ఎలా తెలియజేశారు?
2. మంచి కుమారునికి ఉండవలసిన లక్షణాలేవి?
3. పాఠంలోని పద్యాల ఆధారంగా మీరు నేర్చుకున్న మంచి గుణాలు రాయండి.
4. శతక పద్యాలలోని నీతిని ప్రశంసిస్తూ చిన్న వ్యాసం(పేరా)రాయండి.



భాషాంశాలు

i. పదజాలం

అ) కింది గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.

ఉదా॥ సిరి కలిగి ఉండటం వలన గర్వించకూడదు.

సిరి = సంపద

సంపద ఎవరి వద్ద స్థిరంగా ఉండదు.

1. ఏ పనినైనా విచక్షణతో చేసేవారే బుధులు.

.....

2. రైతులు ధరణిని నమ్ముకొని జీవిస్తారు.

.....

3. కింద గీతగీసిన పదానికి అర్థం గుర్తించండి.

అంబుధిలో నీరు తాగడానికి పనికిరాదు.

అ) సముద్రం ఆ) నది ఇ) చెరువు ఈ) కాలువ

ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలను (పర్యాయపదాలు) గుర్తించి రాయండి.

1. నేను వర్షంలో తడిశాను. వానలో తడవడం మంచిది కాదు.
2. భాస్కరుడు తూర్పున ఉదయిస్తాడు. లోకానికి సూర్యుడు వెలుగునిస్తాడు.
3. రణంలో వెన్నుచూపకపోతే యుద్ధంలో గెలుస్తావు.

ఇ) కింది గీతగీసిన పదాలకు వ్యతిరేకార్థక పదాలు రాయండి.

1. ఇతరుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి.
2. ఎల్లప్పుడు నిజం పలకాలి.
3. ఆపదలనుండి ఉపాయంతో బయటపడాలి.




ఈ) కింది ప్రకృతి - వికృతి పదాలను జతపరచండి.

1. శ్రీ ( ) అ) రోసం
2. దీపము ( ) ఆ) సిరి
3. రోషం ( ) ఇ) దివ్వె

AP SCERT

ii. వ్యాకరణాంశాలు

సంధులు – పదాల వేగవంతమైన కలయిక!



మనం ముందరి పాఠాలలో అక్షరాలు, పదాలు, వాటి ఉనికిని గురించి నేర్చుకున్నాం. ఇప్పుడు మనం వేగంగా మాట్లాడేటప్పుడు మన నోటిలో ఏమి జరుగుతుందో గమనిద్దాం!

శాస్త్రవేత్తలా పరిశీలిద్దాం! (ప్రాయోగిక పద్ధతి)

ఈ రెండు పదాలను విడివిడిగా, నెమ్మదిగా చదవండి:

రాముడు + అతడు

ఇప్పుడు, ఈ రెండు పదాలను కలిపి, వేగంగా చదవండి. మనం నిజంగా మాట్లాడేటప్పుడు ఎలా అంటాం? "రాముడు అతడు" అని ఆపి అంటామా, లేక "రాముడతడు" అని కలిపి అంటామా? ఖచ్చితంగా "రాముడతడు" అనే అంటాం! అక్కడ ఏం జరిగిందో గమనించారా? రెండు పదాలు కలిశాయి, కానీ ఒక అక్షరం (ధ్వని) మాయమైంది!

ఆ మాయమవడం ఎలా జరిగిందో చూద్దాం :

మొదటి పదం : రాముడు (దీన్ని సంధిలో పూర్వపదం అని పిలుస్తారు) దీనిని మనం వ్యాకరణాంశాలలో నేర్చుకున్న "గుణింతం" ప్రకారం విడదీస్తే – రాముడ్ + ఉ (దీన్ని పూర్వస్వరం అంటారు).

రెండవ పదం : అతడు (దీన్ని పరపదం అంటారు. పరపదం మొదట ఉన్న అచ్చు అంటే స్వరం కాబట్టి దీన్ని పరస్వరం అంటారు. అచ్చులకు స్వరం అనే పేరు ఉందని మనం ఇప్పటికే తెలుసుకున్నాం). ఇది అ (అచ్చు) తో మొదలవుతోంది. ఇప్పుడు ఆ కలయికను చూడండి:

రాముడ్ + ఉ + అ తడు. వేగంగా పలికినప్పుడు, మొదటి పదంలోని **ఉ** అనే అచ్చు బలహీనపడి, 'లోపించింది' (అంటే మాయమైంది).

రాముడ్ + ఉ + అతడు – రాముడ్ + అతడు

ఆ ఖాళీలోకి అ అనే అచ్చు వచ్చి చేరింది : రాముడ్ + అతడు = రాముడతడు

"ఉచ్చారణా సౌలభ్యం" కోసం రెండు పదాలు కలిసేటప్పుడు జరిగే ఈ ధ్వని మార్పునే వ్యాకరణంలో "సంధి" అంటారు. 'సంధి' అంటే 'కలయిక'. సంధి జరిగినప్పుడు, **ఉ** లోపించింది (పోయింది). **'అ'** వచ్చి **'ఉ'** స్థానంలో చేరింది. అంటే, **ఉ** మరియు **అ** అనే 'రెండు' అచ్చుల స్థానంలో, **అ** అనే **'ఒకే'** అచ్చు వచ్చి చేరింది. ఇలా రెండు వర్ణాల (అక్షరాల) స్థానంలో **'ఒకే'** వర్ణం వచ్చి చేరడాన్ని **"ఏకాదేశం"** అంటారు. ఈ మొత్తం నేర్చుకున్న అంశాన్నే మన వ్యాకరణ పండితులు "పూర్వపర స్వరంబులకు బరస్వరంబేకాదేశంబగుట సంధి యనంబడు" అనే ఒకే చిన్న సూత్రంలో చెప్పారు. అదే వ్యాకరణ పండితుల ప్రత్యేకత. ఈ సూత్రం చెప్పిన వ్యాకరణ పండితుని పేరు చిన్నయసూరి. ఆయన వ్రాసిన గ్రంథం పేరు బాలవ్యాకరణం.

- **ఉత్వ సంధి :**

మనం పైన చూసిన ఉదాహరణ (రాముడు + అతడు)లో పూర్వపదం చివర (పూర్వస్వరంగా) ఏ అచ్చు ఉంది? **ఉ** అనే అచ్చు. వ్యాకరణ పరిభాషలో **'ఉ'** కారాన్ని "ఉత్వము" అంటారు. కాబట్టి, 'ఉత్వము' (ఉ) పూర్వస్వరముగా ఉన్నప్పుడు జరుగు సంధి కాబట్టి, మన వ్యాకరణ వేత్తలు దీనికి "ఉత్వ సంధి" అని పేరు పెట్టారు.

ఈ పరిశీలన నుండి మనం తెలుసుకున్న 'నియమం' ఏమిటి?

పరిస్థితి 1 : పూర్వపదం చివర 'ఉ' (ఉత్వము) ఉంది. (ఉదా: రాముడ్ + ఉ)

AP SCERT

పరిస్థితి 2 : పరపదం మొదట ఒక 'అచ్చు' ఉంది. (ఉదా : అతడు)

ఫలితం : పూర్వ పదంలోని 'ఉత్వమునకు' పరపదం మొదట ఉన్న **అ** అనే అచ్చునకు సంధి జరిగింది. అంటే రెండు అచ్చుల స్థానంలో పరపదంలోని **అ** అనే అచ్చు ఏకాదేశంగా వచ్చి చేరింది. మనం ఇప్పుడు కనుక్కున్న ఈ నియమాన్నే చిన్నయసూరి ఒక 'సూత్రం'గా చెప్పారు.

"ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధి యగు."

మరి కొన్ని ఉదాహరణలు గమనిద్దాం:

1. అతడు + ఎక్కడ –అతడ్ + ఉ + ఎక్కడ, – అతడ్ + ఎక్కడ – అతడెక్కడ (ఉత్వసంధి)
2. మనసు + ఉంది – మనస్ + ఉ + ఉంది, – మనస్ + ఉంది – మనసుంది (ఉత్వసంధి)
3. సంతోషము + అయ్యెను – సంతోషమ్ + ఉ + అయ్యెను, – సంతోషమ్ + అయ్యెను– సంతోషమయ్యెను (ఉత్వసంధి)

అభ్యాసం 1: పదాలను విడదీద్దాం (పూర్వపదం, పరపదం)

ఇప్పుడు, మొదటి పదాన్ని (పూర్వపదం) మరియు రెండవ పదాన్ని (పరపదం) గుర్తించి, ఖాళీలలో రాయండి.

సంధి పదం (పాఠం నుండి)	పూర్వపదం (మొదటి పదం)	పరపదం (రెండవ పదం)
ఉదా: దీపమున్న	దీపము	ఉన్న
కాలమూరక	.....	.....
వినుమెన్ని	.....	.....
మేఘుడొక	.....	.....
కొడుకొక్కడు	.....	.....

అభ్యాసం 2 : స్వరాలను (అచ్చులను) గమనిద్దాం!

మనం అభ్యాసం 1లో విడదీసిన పదాలనే ఇప్పుడు లోతుగా పరిశీలిద్దాం. ఆ పదాలలో, మొదటి పదం చివర ఏ అచ్చు (పూర్వ స్వరం) ఉంది? రెండవ పదం మొదట ఏ అచ్చు (పర స్వరం) ఉంది?

సంధి పదం	పూర్వపదం చివరి అచ్చు (పూర్వ స్వరం)	పరపదం మొదటి అచ్చు (పర స్వరం)
దీపమున్న	దీపము (మ్ + ఉ) – ఉ	ఉన్న – ఉ
కాలమూరక	కాలము (మ్ + ...) –	.....రక – .....
వినుమెన్ని	వినుము (మ్ + ...) –	.....న్ని – .....
మేఘుడొక	మేఘుడు (డ్ + ...) –	..... క – .....

గమనిక : చూశారా! అన్ని ఉదాహరణలలోనూ మొదటి పదం చివర (పూర్వ స్వరం) 'ఉ'త్వమే ఉంది!

అభ్యాసం 3 : ఉత్వసంధిని అభ్యాసం చేద్దాం!

అ) కింది పదాలను కలిపి రాయండి (సంధి చేయండి):

1. జనములు + అందరు = ...
2. మేలు + ఎంచ = ...
3. మేఘుడు + ఒక = ...

ఆ) కింది పదాలను విడదీయండి (సంధి విడదీయండి) :

1. పాలౌను = ... + ...
2. దిద్దుకోవలెనిల్లు = ... + ...
3. నేరములెన్నడు = ... + ...

AP SCERT

అభ్యాసం 4:

మనం ఉత్వసంధిని బాగా అర్థం చేసుకోవడానికి, ముందరి పాఠాలలోని ఈ అభ్యాసాలు చేద్దాం.

అ) కింది పదాలను విడదీయండి (సంధి విడదీయండి) :

1. నాకొక = ... + ...
2. దొంగలెత్తుకపోరు = ... + ...
3. బావగాడంటారు = ... + ...
4. పట్టెడన్నమె = ... + ...
5. చెట్టెక్కాడు = ... + ...

ఆ) కింది పదాలను కలిపి రాయండి (సంధి చేయండి):

మేలుకొనుము + అయ్య = మేలుకొనుమయ్య

1. వీళ్లు + అందరూ = ...
2. ఇల్లు + ఉంది = ...
3. ప్రజలు + అందరూ = ...
4. డొక్కలు + ఎండిపోయిన = ...

అభ్యాసం 5 : మీ పరిశీలన

పిల్లలూ, ఇప్పుడు మీ వంతు! మన పాత పాఠాలలోని ఉత్వసంధులను వెతికి విడదీసి రాయండి.

సంధి పదం (మీరు వెతికింది)	పూర్వపదం	పరపదం



చమత్కార పద్యం

హరి కుమారుడై యొప్పెడునాతడు హరి
హరికి దక్షిణనేత్రమౌ నాతడు హరి
హరికి శిరముతోడ వరలు నాతడు హరి
హరికి వామాక్షమౌ యొప్పునాతడు హరి



నేనివి చేయగలనా?



1.	పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను.	ఔను / కాదు
2.	పద్యభావాలను సొంత మాటలలో చెప్పగలను, రాయగలను.	ఔను / కాదు
3.	పాఠంలోని పదాలకు సంధులను గుర్తించగలను.	ఔను / కాదు
4.	పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను.	ఔను / కాదు

AP SCERT



చదవండి - ఆనందించండి

సమయపాలన

- జీవనవిద్య

సమావేశానికి గాంధీగారంతటి వ్యక్తి నిరాడంబరంగా, సరైన సమయానికి సైకిల్‌మీద రావడం చూసిన అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన ఒక్క క్షణం కూడా ఆలస్యం కాకుండా సభాస్థలికి చేరుకున్నారు. గాంధీజీ విలువల్ని పాటించే వ్యక్తి. ప్రాణం పోయినా సమయ పాలనను విడిచిపెట్టేవారు కాదు. ఏ పనైనా అది ఏ సమయానికి జరగాలో ఆ సమయానికి ఆరు నూరైనా, నూరు ఆరైనా జరిపేవారు. ఆఖరుకి జైలులో ఉన్న సమయంలో కూడా ఖచ్చితమైన సమయపాలన చేసేవారు గాంధీజీ.

దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు, ప్రతిరోజూ ఉదయం పళ్ళు తోముకునే సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు, అంతకు ముందురోజే కొన్ని భగవద్గీత శ్లోకాలను కాగితం మీద రాసి గోడమీద అతికించుకుని, పళ్ళు తోముకునే సమయంలో వాటిని బట్టీపట్టేవారు. ఆవిధంగా భగవద్గీతలోని చాలా అధ్యాయాలను గాంధీగారు కంఠస్థం చేశారు. అంత చక్కగా సమయాన్ని వినియోగించుకునే వారు గాంధీజీ.



విలువైన గడియారం ధరించి సమయపాలన చేయకపోవడం కంటే, సమయపాలన కోసం గడియారాన్ని మరిచిపోయినా ఫరవాలేదు కదా! అదే మనమైతే నిజంగా సమయం ఉన్నా లేదని చెప్పి, టీవీ చూస్తూనో, కబుర్లు చెబుతూనో కాలక్షేపం చేసి ఎంతో సమయాన్ని పాడుచేస్తూ ఉంటాం. కానీ చేయాల్సిన పనిని మాత్రం సమయానికి పూర్తిచేయక, తర్వాత జరిగిన నష్టానికి మనమే బాధపడుతూ ఉంటాం.

అందుకే అందరూ బాల్యం నుండే సమయపాలన అలవాటు చేసుకోవాలి. ఎటువంటి పరిస్థితులలోనైనా సమయాన్ని తప్పకుండా, జాగ్రత్తగా ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకోవాలి.

మరి అందరం అదే బాటలో పయనిద్దామా!

© SCERT

6. మన మహనీయులు (ఉపవాచకం)

I5Z4P8

– రచయితల బృందం

తెలుగు ప్రజల హితం కోసం తపించి నిరంతరం శ్రమించిన "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు". ప్రాణత్యాగానికి వెనుదీయక తెలుగు జాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టినవారు, తమ ప్రతిభా పాటవాలతో భారత జాతీయ కీర్తిపతాకం ఎగురవేసినవారు, జాతీయ సమైక్యతకై ప్రతినపూని, తమ పాండిత్యంతో తెలుగు భాషను, సంస్కృతిని గుబాళింప జేసినవారు – ఇలా ఎందరో మహనీయులు మన తెలుగుజాతి ఆణిముత్యాలుగా ఉన్నారు.

ఆ మహనీయుల జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం. వారి త్యాగం అమూల్యం. వారి కృషి జాతికి పథనిర్దేశం. వారి ప్రతిభ జాతిగౌరవ పరిమళం. వారిని స్మరించుకోవడం మన బాధ్యత.

అమరజీవి పొట్టి శ్రీరాములు



1952 డిసెంబరు 16 మంగళవారం. తూర్పున సూర్యుడు ఉదయించే సరికి ఆకాశవాణి వార్త అశనిపాతంలా నలుదిశలా ధ్వనించింది. ఆ వార్తకు తెలుగు నేల ద్రవించింది. తెలుగు ప్రజలు గుండె కోతను తట్టుకోలేక విలవిల లాడిపోయారు. "గత రాత్రి గం॥ 11.30 ని॥లకు పొట్టి శ్రీరాములు ప్రాణ వాయువులు అనంతాకాశంలో కలిసిపోయాయి" అన్నది ఆ వార్త. ఎవరా పొట్టి శ్రీరాములు? ఎందుకు ఆంధ్రుల ఆర్తనాదాలు?

పొట్టి శ్రీరాములు పూర్వికులు ఒకప్పటి నెల్లూరు జిల్లా కనిగిరి (ప్రస్తుతం ప్రకాశంజిల్లా) ప్రాంతీయులు. వ్యాపారరీత్యా మద్రాసు (చెన్నై) లో స్థిరపడ్డారు. శ్రీరాములుగారు గురవయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు మద్రాసులో 16-3-1901 న జన్మించారు. మద్రాసు, బొంబాయి నగరాలలో విద్యాభ్యాసం చేశారు. తన మేనమామ కుమార్తె సీతమ్మను వివాహం చేసుకొన్నారు. బొంబాయిలో అసిస్టెంటు ప్లంబర్‌గా ఉద్యోగంలో చేరి అక్కడే నివాసం ఉన్నారు. విశ్రాంతివేళల్లో అక్కడ పనిచేస్తున్న కార్మికుల యోగక్షేమాలు విచారించేవారు. పేదవారి కష్టాల్లో పాలుపంచుకొనేవారు. ఇతరుల కోసం ఏదోఒకటి చేయాలని తపించేవారు. గాంధీజీ బోధనలకు శ్రీరాములు ఆకర్షితుడయ్యారు. ఆ బోధనలే వీరిని భారత స్వాతంత్ర్యోద్యమంవైపు నడిపించాయి.

ఆయన చేస్తున్న ఉద్యోగం వదలి సబర్మతీ ఆశ్రమంలో చేరారు. రాజ్‌కోట్ సత్యాగ్రహంలో పాల్గొని ఆరు నెలలు గాంధీతోపాటు జైలుశిక్ష అనుభవించారు. ఉద్యమంలో భాగంగా ఖాదీప్రచారం, మద్యపాన నిషేధ ప్రచారం, నిమ్నజాతులకు దేవాలయ ప్రవేశం వంటి సాంఘికసేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆంధ్రులు, తమిళులకు కలిపి ఒకే రాష్ట్రం ఉండటం వల్ల తెలుగువారు అనేక ఇబ్బందులు పడటం వీరు గమనించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం 1911 నుండి ఎన్నో సభలూ, సమావేశాలూ, తీర్మానాలూ జరుగుతున్నాయి. కానీ ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఒక అమూల్య త్యాగం అవసరమని దృఢంగా నిశ్చయించుకున్నారు. నెల్లూరులో ఆత్మీయులకు సూచనప్రాయంగా తన సంకల్పాన్ని చెప్పి మద్రాసు బయలుదేరారు.

AP SCERT

"ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేస్తూ ప్రకటించేవరకూ నా దీక్ష ఆమరణాంతం కొనసాగిస్తాను" అని ప్రకటించి 19-10-1952 న ఆదివారం శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష






ఆంధ్ర ప్రాంతమంతా సభలూ, సమావేశాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ఊపందుకుంది. రోజులు గడిచేకొద్దీ వారి ఆరోగ్య పరిస్థితి అంతకంతకూ దిగజారింది. సత్యాగ్రహి లేవలేక మాట్లాడలేని స్థితికి వచ్చారు. అయినా ఢిల్లీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన చందంగా కూర్చుంది. 15-12-1952 తేది రాత్రి 11.30 ని॥లకు శ్రీరాములు హృదయస్పందన ఆగిపోయింది. వీరి ప్రాణత్యాగం ఒక దావానలంగా ఆంధ్రప్రాంతం అంతటా వ్యాపించింది. ప్రతి ఆంధ్రుడు ఒక అగ్నికీలగా మండ సాగాడు. ఆంధ్ర ప్రాంతమంతటా హర్తాళ్ళు, ఆందోళనలతో అట్టుడికి పోయింది. ఈ మహారుధ్రమారుతం మూడురోజులపాటు సాగింది. "ఆంధ్రరాష్ట్రం ఇస్తున్నాం" అని నెహ్రూ ప్రకటించేవరకూ సాగింది. శ్రీరాములుగారు ఆంధ్రుల చిరకాల స్వప్నం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలేసిన చిరస్మరణీయుడు.

1-10-1953 న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. శ్రీరాములుగారు మన ఆంధ్రులకు అమరజీవి అయ్యారు.

జాతీయ జెండా రూపశిల్పి - పింగళి వెంకయ్య

రివ్వు రివ్వున సాగిపోవు - రంగురంగుల జెండా
మన మూడు రంగుల జెండా
రండి ఓ బాలలార - బండి బయలుదేర
ఇక జెండా ఎగురవేయ



అని జెండాపాటలు పాడతాంకదా! ఆ పతాకం జాతి ఆత్మాభిమానానికి దేశ సార్వభౌమాధికారానికి చిహ్నం. ఆకాశవీధిలో జెండా రెపరెపలాడుతూ ఉంటే ప్రతి భారతీయుడి గుండె దేశభక్తితో ఉప్పొంగుతుంది.

AP SCERT


ఎందరో వీరుల త్యాగం జ్ఞప్తికి వస్తుంది. అంతటి మహనీయత కలిగిన మన జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య.

జెండా వెంకయ్యగా ప్రసిద్ధుడైన పింగళి వెంకయ్య 1878 ఆగష్టు 2వ తేదీన కృష్ణాజిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. వీరు హైస్కూలు చదువు పూర్తిచేసిన తరువాత దేశభక్తితో 19 ఏళ్ళ వయసులోనే సైన్యంలో చేరారు. మన దేశానికి స్వాతంత్ర్యం కోసం ఉద్యమజ్వాలలు ఎగిసి పడుతున్న తరుణం అది. గాంధీగారితో వీరి పరిచయం స్వాతంత్ర్య ఉద్యమానికి బాట పట్టించింది.

1906వ సంవత్సరంలో కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలకు పింగళి వెంకయ్య హాజరయ్యారు. అక్కడ బ్రిటీషు జెండా ఎగుర వేయడం వీరికి నచ్చలేదు. బ్రిటీషువారి సార్వభౌమాధికారం తెలిపే వారి జెండా మనకు జాతీయపతాకం ఎలా అవుతుందన్న ప్రశ్న వెంకయ్యగారికి తలెత్తింది. జాతీయ జెండా రూపకల్పనకు వెంకయ్యగారిని పురికొల్పింది.

1921వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన అఖిల భారతీయ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ పింగళి వెంకయ్యను జాతీయ పతాకం చిత్రించి ఇవ్వమని అడిగారు. మూడుగంటల వ్యవధిలో జెండాను రూపొందించి ఇచ్చారు. జెండాలో కాషాయంరంగు త్యాగానికి, దేశభక్తికి ప్రతీకగా, తెలుపురంగు శాంతికి సత్యానికి చిహ్నంగా, ఆకుపచ్చరంగు సమృద్ధికి, నమ్మకానికి గుర్తుగా వీరు త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు. ఈ పతాకం మధ్యలో మొదట రాట్నం ఉండేది. తరువాత దాని స్థానంలో అశోక ధర్మచక్రం చేర్చారు.

భారతీయులందరికీ ఉద్యమ స్ఫూర్తినికలిగించి స్వాతంత్ర్యోద్యమం కొరకు ఏకతాటిపై తేగలిగింది మన జెండాయే! మన జాతీయజెండా రూపకర్త మన ఆంధ్రుడవ్వడం మనకు గర్వకారణం. నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవాతత్పరతే ధ్యేయంగా బ్రతికిన వీరు 04-07-1963న స్వర్గస్థులయ్యారు. వారు మన మధ్య లేకపోయినా వారు రూపొందించిన జాతీయపతాకం ప్రతి భారతీయుని గుండె ఉప్పొంగేలా, జాతి సగర్వంగా తలయెత్తుకొనేలా ఆచంద్రతారార్కం రెపరెపలాడుతూనే ఉంటుంది.



AP SCERT

"జాతీయ ప్రతిజ్ఞ" నిర్మాత పైడిమర్రి వెంకట సుబ్బారావు



బడిపిల్లలంతా బడి ఆవరణంలో ఉదయం జరిగే ప్రార్థనా సమావేశంలో "భారతదేశం నా మాతృభూమి" అంటూ చేసే ప్రతిజ్ఞ అచంచలమైన దేశభక్తిని, అంతులేని జాతీయతా భావచైతన్యాన్ని, ఎనలేని సోదరభావాన్ని కలుగజేస్తుంది. అందుకే ఈ ప్రతిజ్ఞ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని భారతీయ భాషల పాఠ్యపుస్తకాలలో ముద్రించ బడింది. ఈ ప్రతిజ్ఞ రాసిన మహనీయుడు పైడిమర్రి వెంకటసుబ్బారావు మరొక తెలుగుజాతి ఆణిముత్యం.

1962 లో భారత్-చైనా యుద్ధం ముగిసిన తరువాత మనదేశ విద్యార్థులలో ప్రాథమిక దశనుండే దేశభక్తి కలిగించాలనే భావం సుబ్బారావుగారికి కలిగింది. "భారతదేశం నా మాతృభూమి" అనే ప్రతిజ్ఞ రాశారు. తెన్నేటి విశ్వనాథంగారితో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ప్రతిజ్ఞ విలువను, అవసరాన్ని వివరించి ప్రతిని అందజేశారు. 1964 లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీంచాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశంలో జాతీయ ప్రతిజ్ఞగా దీన్ని స్వీకరించారు. ఆ ప్రతిజ్ఞ 1965 జనవరి 26 నుంచి భారతదేశమంతటా అన్ని భాషల పాఠ్యపుస్తకాలలో చేర్పించారు.

పైడిమర్రి వెంకట సుబ్బారావు నల్గొండ జిల్లాలో అన్నెపర్తి గ్రామంలో 1916 జూన్ 10వ తేదీన వెంకటరామయ్య, రాంబాయమ్మలకు జన్మించారు. బాల్యంలోనే తన తల్లి రామాయణ, మహాభారతాలు చెప్పేది. బాల్యంలోనే దేశభక్తి బీజాలు పడ్డాయి. 1962 లో విశాఖపట్టణంలో ట్రెజరి అధికారిగా పనిచేశారు. పుస్తక సేకరణ, పఠనం, కవితా వ్యాసంగం, వేద అధ్యయనం చేసేవారు. ఆయన భూస్వామ్య



AP SCERT

పద్ధతిలోని వెట్టిచాకిరిని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్యకావ్యాలు రాసారు. గృహస్థ జీవితం, స్త్రీధర్మము, తార, శ్రీమతి అనే నాటకాలు రాసారు. బాలరామాయణం, వెంకటేశ స్తుతులు మొదలైన రచనలు చేశారు.

భారతదేశ వారసత్వ సంపదగా వస్తున్న సాంస్కృతిక, సామాజిక విలువలను కాపాడటం భావి భారతపౌరుల ప్రథమ కర్తవ్యం. ఇందుకోసం బాలలను సమాయత్తం చేస్తుందీ ప్రతిజ్ఞ. దేశభాషలన్నింటిలోనికి అనువదించబడి, దేశమంతా ప్రతినిత్యం ప్రతిధ్వనిస్తూ, జాతీయ గీతాల సరసన వెలుగుతుంది. ఈ ప్రతిజ్ఞ ధ్వనించినంతకాలం "పైడిమర్రి" వారు దేశ పౌరుల హృదయాలలో కలకాలం నిలిచే ఉంటారు.

సుందరకవి - శంకరంబాడి సుందరాచారి




బెనారస్ విశ్వవిద్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు తెలుగు విద్యార్థులందరూ సమావేశమై వస్తానన్న అతిథికోసం ఎదురుచూస్తున్నారు. చెప్పిన సమయం నాలుగు దాటిపోయింది. నాలుగున్నర... ఐదు... ఐదున్నర... మనిషి అంతులేడు. విద్యార్థులు అసహనంతో ఊగిపోతున్నారు. నిర్వాహకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. అందరిచూపు గేటు వైపే.

ఆరు గంటలకు... అతిసామాన్యమైన నేతబట్టలు ధరించి, చేతిలో సంచితో నడుచుకుంటూ వేదిక వైపు వచ్చాడాయన. ఊపిరి పీల్చుకున్నారు నిర్వాహకులు. ఇంతలో బరంపురానికి చెందిన కుర్రాడు కాస్త గడుసుగా "ఇప్పుడొచ్చాడయ్యా! ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో" అన్నాడు. ఆయన వినలేదనుకున్నారందరూ. "ఒరేయ్ అబ్బాయ్! నువ్వు లే!" అన్నాడు ఆ కుర్రాడిని వేలు చూపిస్తూ. "ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో అన్నది నువ్వే కదా! నేను మాట్లాడటం ప్రారంభించి ఆపేలోపు నీ అంతట నువ్వే లేచి వెళ్ళగలిగితే వెళ్ళిపో! సవాల్!" అన్నాడాయన. ఆలస్యంగా వచ్చి, అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఈ సవాల్ ఏమిటో అర్థంగాక తలలు పట్టుకున్నారు నిర్వాహకులు.



"మీరంతా తెలుగువాళ్ళుకదా! మీకసలు తెలుగు సరిగ్గా మాట్లాడటం వచ్చా? తెలుగు ఎలా ఉంటుందో చూపిస్తా చూడండి" అంటూ చిత్రంగా అక్కడి వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తూ ప్రసంగం ప్రారంభించారు. తెలుగు గ్రామీణ జీవనంలో తెల్లవారుజామున కోడి కూసింది మొదలు జీవితాలు ఎలా ప్రారంభమవుతాయి? అనే వాటిని గురించి వివరించారు. పల్లెపడుచుల కూనిరాగాలూ, పశువుల అరుపులూ, పిట్టల కూతలూ, ముగ్గులు వేస్తూ ఇల్లాలు పాడే తెలుగు జానపద గీతాలూ, పల్లెసుద్దులూ, అమ్మ పాడే భక్తిపాటలూ, పిల్లల ఆటలూ, పాటల గురించి వర్ణించారు. గంగిరెద్దుల చప్పుళ్ళూ, హరిదాసు నృత్యాలూ, రచ్చబండ వద్ద పెద్దల ఊతపదాలూ - ఒకటేమిటి ? యావత్ తెలుగు ప్రజల సజీవ భాషా భాగవతమంతా ఆటా, పాటా మాటల రూపంలో గంటన్నరపాటు ప్రవాహంలా ఆడుతూ, పాడుతూ కళ్ళకు కట్టినట్టు చూపించారు. మంత్రముగ్ధులై అంతా నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. "ఏమోయ్ కుర్రోడా!

APSCERT



గంటన్నర అయ్యింది. లేచి వెళ్ళలేదే? పో!" అన్నారాయన. "నన్ను వదిలేయండి స్వామీ" అన్నాడు ఆ కుర్రాడు.

'ఇక ఆపేస్తున్నా' అన్నారాయన. లేదు లేదు ఇంకా మాట్లాడండి అంటూ అందరూ కేకలు. మరొక అరగంట అదే ప్రవాహం.

బెనారస్ విశ్వవిద్యాలయంలో తెలుగు విద్యార్థులకు ఉపన్యాసంగా...

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు

– అంటూ తెలుగు రాష్ట్ర గేయంగా తెలుగుభాషను, సంస్కృతిని తెలుగు ప్రజలందరి నాలుకలపై నర్తింపచేసిన ఘనాపాఠి ఎవరోకాదు సుందరకవి శంకరంబాడి సుందరాచారి.

సుందరాచారి చిత్తూరుజిల్లా, తిరుపతిలో 1914 ఆగష్టు 10న జన్మించారు. తిరుపతి దేవస్థానం పాఠశాలలో, మదనపల్లి బీసెంట్ థియోసాఫికల్ సొసైటీలో విద్యాభ్యాసం చేశారు. ఉపాధ్యాయునిగా, ఆంధ్రపత్రికకు సంపాదకుడిగా, పాఠశాలల పర్యవేక్షకునిగా పనిచేశారు. సుందర రామాయణం, సుందర భాగవతం, బలిదానం, అపవాదు, పేదకవి, నాస్వామి, నేటికవిత్వం, కావేటి నగరరాజ నీరాజనం, శ్రీనివాస శతకం, బుద్ధగీత వంటి ఎన్నో రచనలు చేశారు. సినిమా పాటలు రాశారు. తెలుగుభాష, సంస్కృతులపై అమితమైన అభిమానంతో జీవించినంతకాలం వాటి పరిమళాలను తన కలంతో వెదజల్లిన సుందరాచారి 1977 ఏప్రియల్ 8న తిరుపతిలో కన్నుమూశారు.

2004 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన జ్ఞాపకార్థం ఆ విగ్రహం దగ్గర మైకు ద్వారా "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గేయం నిరంతరం ధ్వనించే ఏర్పాటుచేసింది. తెలుగుజాతి ఉన్నంతవరకూ శంకరంబాడి సుందరాచారి తెలుగు ప్రజల గుండెల్లో నిలిచే ఉంటారు.

జాతిని జాగృతి చేసిన మహనీయుల సేవాతత్పరత, నిస్స్వార్థ ప్రవృత్తి, జాతి జనులకు వెలుగుబాట పరిచిన వ్యక్తుల చరిత్రలు భావిభారత పౌరులుగా తెలిసికొని ఆచరించడానికి ప్రయత్నించాలి. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం మన కర్తవ్యం.

AP SCERT

అ) లఘు ప్రశ్నలు

1. పింగళి వెంకయ్యగారిని గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.
2. శంకరంబాడి గారి జ్ఞాపకార్థం తిరుపతిలో ఎటువంటి ఏర్పాటు జరిగింది?
3. ప్రతిజ్ఞ విద్యార్థులలో ఎటువంటి భావాలను కలిగిస్తుంది?

ఆ) వ్యాసరూప ప్రశ్నలు

1. తెలుగు భాష, సంస్కృతులపై 'శంకరంబాడి సుందరాచారి' సాధికారతను తెలిపే సంఘటనను సొంత మాటల్లో రాయండి.
2. ఆంధ్రరాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు త్యాగం గురించి సొంతమాటల్లో రాయండి.

పదవిజ్ఞానం

అ

1. అంకె = వశం
2. అంగడి = కొట్టు (దుకాణం)
3. అంబుధి = సముద్రం
4. అఘము = పాపం
5. అజ్ఞానం = జ్ఞానం లేకపోవడం
6. అణగుట = నశించుట
7. అతుల = సాటిలేని
8. అధునాతనము = ఆధునికం
9. అనర్గళంగా = ధారాళంగా/అడ్డంకి లేకుండా
10. అనుకరించు = మరొకరు చేసినట్లు చేయు
11. అనుగుణము = తగినది/అనుకూలమైనది
12. అన్వేషణ = వెదకుట
13. అబ్ధి = సముద్రం
14. అర్థించి = వేడుకొని
15. అలరించు = ఆనందింపజేయు
16. అవగతము = తెలియబడినది
17. అశ్వము = గుర్రం
18. అసువులు = ప్రాణాలు

ఆ

1. ఆకృతి = ఆకారం
2. ఆచరణ = నిజ జీవితంలో అమలు చేయడం / నడత
3. ఆజ్ఞ = ఆనతి
4. ఆత్మవిశ్వాసం = తన శక్తి సామర్థ్యాలపై తనకున్న నమ్మకం
5. ఆనందపరవశుడు = సంతోషంచేత పరాధీనుడు
6. ఆపన్నులు = ఆపదలో ఉన్నవారు
7. ఆపద = ప్రమాదం
8. ఆప్యాయత = ప్రేమ, ఆదరం
9. ఆలు = భార్య
10. ఆవశ్యకత = అవసరం
11. ఆశ్రయించు = ఆధారంచేసుకొను
12. ఆశ్రితులు = ఆశ్రయించినవారు

ఇ

1. ఇంకుట = ఇగిరిపోవుట
2. ఇంతి = స్త్రీ
3. ఇమ్ముగ = కుదురుగ / స్థిరంగా

ఉ

1. ఉచ్చు = పక్షులు మొదలైన వాటిని పట్టడానికి పెట్టే ఉరి
2. ఉజ్జ్వల = బాగా ప్రకాశించేది
3. ఉత్తరీయం = కండువా
4. ఉదకము = నీరు
5. ఉబలాటం = కుతూహలం / ఒక పని చేయాలనే తొందరతో కూడిన కోరిక

ఏ

1. ఏకభుక్తులు = ఒకపూట మాత్రమే తినేవారు
2. ఎడబాయు = వేరగు
3. ఎలమి = సంతోషం
4. ఎరుక = జ్ఞానం

ఐ

1. ఐశ్వర్యం = సంపద

ఒ

1. ఒద్దిక = అనుకూలత, స్నేహం
2. ఒనగుట = ఇచ్చుట

ఔ

1. ఔన్నత్యము = గొప్పతనం

క

1. కదనం = యుద్ధం
2. కనుమఱుగు = కంటికి కనిపించకుండా పోవు
3. కన్నుల పండుగ = చూడడానికి ఆనందంగా ఉండటం
4. కపటం = మోసం
5. కపి = కోతి
6. కర్తవ్యం = బాధ్యత
7. కవిపుంగవుడు = శ్రేష్ఠమైన కవి
8. కాంస్యం = కంచు
9. కాలుడు = యముడు
10. కాడు = శ్మశానం
11. కాలయముడు = ప్రాణాలు తీసేవాడు
12. కావలి = రక్షణ
13. కినియు = కోపించు
14. కూడు = అన్నం
15. కూరిమి = స్నేహం
16. కృతజ్ఞతలు = ధన్యవాదాలు
17. కేరింత = నవ్వు / సంతోషంలో చేసే ధ్వని
18. కోటీరము = కిరీటం
19. కోమలి = అందమైన స్త్రీ
20. కోలాహలం = హడావుడి

గ

1. గండం = ప్రమాదం
2. గిరాకీ = వెల ఎక్కువ / కొనుగోలు దారులకు న్న ఆసక్తి

AP SCERT

ఘ

1. ఘట్టం = రసవంతమైన సన్నివేశం

చ

1. చారెడు = కొద్దిగా చెయ్యి వంచినప్పుడు ఏర్పడే పరిమాణం, ఒక చేతిలో పట్టినన్ని
2. చిక్కం = తీగలతో అల్లి పశువుల మూతికి తగిలించే బుట్ట
3. చిరస్మరణీయుడు = నిత్యం స్మరింపదగినవాడు
4. చేజారిపోవు = చేతి నుండి విడిపోవు
5. చేటు = కీడు, అనర్థం

జ

1. జాగృతి = మేలుకొలుపు
2. జాడ = ఆనవాలు
3. జీవనశైలి = జీవించే విధానం/ బతికే పద్ధతి

డ

1. డెందము = హృదయం

త

1. తనయ = కూతురు
2. తనరు = ప్రకాశించు
3. తనూభవుడు = కుమారుడు
4. తర్కించు = చర్చించు
5. తరుణము = తగిన సమయం
6. తలపోయు = ఆలోచించు
7. తహతహలాడు = ఆరాటపడు, తొందరపడు
8. తిలలు = నువ్వులు
9. తీవ్రత = ఆధిక్యం
10. తుల్యం = సమానం
11. తెంపు = సాహసం
12. తేట తెల్లంచేయు = మిక్కిలి స్పష్టంగా వివరించు

ద

1. దత్త = ఇవ్వబడిన
2. దనుజులు = రాక్షసులు
3. దళం = ఆకు
4. దాణా = పశువులకు పెట్టు ఆహారం
5. దాశరథి = శ్రీరాముడు
6. ద్విపము = ఏనుగు
7. ద్వీపము = నాలుగువైపులా నీటితో చుట్టబడిన భూమి
8. దుర్గతి = చెడ్డస్థితి
9. దుర్భరం = భరింపలేనిది
10. దేదీప్యమానం = మిక్కిలి ప్రకాశవంతం
11. దొరతనం = ప్రభుత్వం, అధికారం
12. దోచు = అపహరించు

ధ

1. ధరణి = భూమి
2. ధాటి = దాడి

న

1. నారి = స్త్రీ
2. నిక్కం = నిజం
3. నిరాడంబరం = ఆడంబరం లేనిది
4. నిర్దేశం = ఆజ్ఞ
5. నిశ్చితాభిప్రాయం = దృఢమైన అభిప్రాయం, గట్టినిర్ణయం
6. నిష్ఫలం = ప్రయోజనం లేనిది
7. నెమ్మి = ప్రేమ, క్షేమం
8. నెఱిగుఱి = సరియైన లక్ష్యం
9. నేరము = తప్పు

ప

1. పటాపంచలు = చెల్లా చెదరు
2. పథకం = ఆలోచన, ప్రణాళిక
3. పరస్పరం = ఒకరికొకరు
4. పరవ = ప్రవాహం
5. పస్తు = ఉపవాసం
6. పాటు = ఆపద
7. పాతకం = పాపం
8. పామరుడు = తెలివిలేనివాడు
9. పారదని = జరగదని
10. పీడ = బాధ
11. పుంగవం = ఎద్దు
12. పుడుక = పుల్ల (పుడకఅనివాడుక)
13. పుష్కలం = అధికం, సమృద్ధి
14. పుస్తె = తాళిబొట్టు
15. పొంచి = చాటున దాగియుండి
16. పొలతి = స్త్రీ
17. పోరాటం = యుద్ధం
18. పోరు = యుద్ధం
19. ప్రజ్ఞాశాలి = ప్రతిభ గలవాడు
20. ప్రతీక = గుర్తు
21. ప్రథితం = ప్రఖ్యాతి నొందినది
22. ప్రభువు = రాజు
23. ప్రస్తుతం = ఇప్పుడు
24. ప్రాచీనం = పూర్వకాలం, పురాతనం
25. ప్రాణం = జీవం
26. ప్రారంభం = మొదలు

బ

1. బుధుడు = పండితుడు
2. బుడతడు = బాలుడు

AP SCERT

భ

1. భద్రం = శుభకరం, శ్రేష్ఠం
2. భావన = తలపు/ఆలోచన
3. భావి = భవిష్యత్తు
4. భాస్కరుడు = సూర్యుడు
5. భీతి = భయం
6. భూషణములు = అలంకారాలు
7. భేదం = తేడా
8. భ్రాతృజనం = అన్నదమ్ములు

మ

1. మకాం = నివాసం
2. మదం = గర్వం
3. మదత్రయం = విద్యాగర్వం, ధనగర్వం, కులగర్వం
4. మనుచు = రక్షించు
5. మనువు = బ్రతుకు
6. మట్టగుడిసె = ఒకరకమైన చేప
7. మమకారం = ప్రేమ/నాది అనేభావం
8. మహనీయులు = గొప్ప వారు
9. మిన్నక = ఊరక/అప్రయత్నంగా
10. ముట్టుకోవడం = తాకడం
11. మున్నీరు = సముద్రం
12. ముల్లె = ధనం/మూట
13. మెలకువ = మేలుకొనుట/జాగృతి
14. మేటి = శ్రేష్ఠం
15. మేను = శరీరం
16. మైత్రి = స్నేహం
17. మొరాయించు = చెప్పిన మాట వినక పోవడం
18. మొహమాటం = జంకు, సంకోచం
19. మోళీ = రీతి/తరగతి
20. మౌనం = మాట్లాడకుండా ఉండడం

య

1. యాచకులు = భిక్షుకులు

ర

1. రణము = యుద్ధం
2. రమ్యము = అందమైనది
3. రాజద్రోహం = రాజాపరాధం
4. రాట్నం = నూలువడికే యంత్రం
5. రాశి = పోగు
6. రూకలు = నాణెములు
7. రూపు మాయు = నశించు, అంతరించు

ల

1. లేసు = సులభం, చులుకన

వ

1. వదనం = ముఖం
2. వర్ధనం = వృద్ధి పొందించేది
3. వలయాకారం = గుండ్రని రూపం
4. వాత్సల్యం = ప్రేమ
5. వ్రాత = సమూహం కలది
6. విక్రయించు = అమ్ము
7. విచ్ఛిన్నం = ముక్కలు చేయబడినది
8. విధూతము = కదలించబడినది
9. విరసం = రసము లేనిది
10. వివేకి = తెలివైనవాడు
11. విహరిస్తున్న = స్వేచ్ఛగా తిరుగుతున్న
12. వీడ్కోలు = వెళ్ళడానికి ఇచ్చే అనుమతి
13. వెఱచు = భయపడు
14. వైరం = శత్రుత్వం

శ

1. శింశుపా వృక్షం = ఇరుగుడు చెట్టు
2. శుంభత్ = ప్రకాశించే
3. శుద్ధము = పవిత్రం
4. శూరులు = శౌర్యం కలవారు
5. శ్రేయస్సు = శుభం

స

1. సాంక్రమికవ్యాధులు = అంటువ్యాధులు
2. సంఘాతం = సమూహం/గట్టి దెబ్బ
3. సంచితం = కూడబెట్టబడినది
4. సంప్రదాయం = గతంనుండి పాటిస్తూ వచ్చిన నిర్దిష్ట ఆచారం
5. సంబరం = సంతోషం
6. సంస్కృతి = ఆచారవ్యవహారాలు, నాగరికత
7. సఖ్యంగా = స్నేహంగా
8. సత్కవి = మంచికవి
9. సత్యమైనది = నిజమైనది
10. సన్నుతి = చక్కని పొగడ్త
11. సాక్షాత్కరించు = ప్రత్యక్షమగు
12. సిరి = సంపద
13. సుంత = కొంచెం
14. సునాయాసం = తేలిక
15. సువర్ణము = బంగారం
16. సొంపు = అందం
17. స్ఫూర్తి = స్ఫురణం, ప్రకాశం
18. స్మరించు = తలచుకొను
19. స్వాంతం = హృదయం
20. స్మారకం = స్మృతిచిహ్నం

హ

1. హరియించు = చంపు
2. హితము = మేలు
3. హితుడు = మేలుకోరేవాడు
4. హెచ్చు = ఎక్కువ

AP SCERT

పర్యాయ పదాలు

1. అఘము : పాపం, దురితం
2. అధికం : ఎక్కువ, మెండు
3. అనలం : అగ్ని, వహ్ని
4. అబ్ధి : సముద్రం, జలధి
5. అశ్వము : గుర్రం, తురగం
6. ఇంతి : స్త్రీ, వనిత
7. ఉదకము : నీరు, జలం
8. ఉర్వి : భూమి, వసుధ
9. కన్ను : నేత్రం, నయనం
10. కపి : కోతి, మర్కటం
11. కుమారుడు : తనయుడు, పుత్రుడు
12. కూరిమి : స్నేహం, చెలిమి
13. కాశీ : వారణాసి, అవిముక్తం
14. డెందము : హృదయం, ఎద
15. తండ్రి : జనకుడు, పిత
16. తరుణము : సమయం / కాలం
17. దనుజులు : అసురులు, రాక్షసులు
18. దుఃఖము : ఖేదం, బాధ
19. నంది : వృషభం, ఎద్దు
20. నారి : స్త్రీ, పొలతి
21. పరులు : ఒరులు, ఇతరులు
22. పామరుడు : అజ్ఞుడు, నీచుడు
23. ప్రతీక : గుర్తు, చిహ్నం
24. ప్రారంభం : అంకురార్పణ, మొదలు
25. ప్రాచీనము : ప్రాక్తనం, సనాతనం
26. భాస్కరుడు : సూర్యుడు, భానుడు
27. ప్రాణం : ఉసురు, జీవం
28. మకాం : బస, నివాసం
29. మదం : గర్వం, పొగరు
30. మాత : తల్లి, జనని
31. మేను : శరీరం, దేహం
32. మైత్రి : స్నేహం, నెయ్యం
33. రణం : యుద్ధం, పోరు
34. రథము : తేరు, స్యందనం
35. రాజు : ప్రభువు, భూపతి
36. వృక్షం : చెట్టు, తరువు
37. సకలం : సర్వం, సమస్తం
38. స్వర్గం : దివి, నాకం

ప్రకృతి-వికృతి

1. అంబ – అమ్మ
2. ఆకాశం – ఆకసం
3. ఆశ్చర్యం – అచ్చెరువు
4. ఆహారం – ఓగిరం
5. ఉత్తరీయం – ఉత్తరిగం
6. కథ – కత
7. కవి – కయి
8. కాలం – కారు
9. కార్యం – కజ్జం
10. కుమారుడు – కొమరుడు
11. గర్భం – కడుపు
12. త్యాగం – చాగం
13. దిశ – దెస
14. దీపం – దివ్వె
15. దోషం – దోసం
16. ధర్మము – దమ్మం
17. పుణ్యము – పున్నెం
18. పుస్తకము – పొత్తం
19. భక్తి – బత్తి
20. సంతోషం – సంతసం



AP SCERT

భావనా పటం – 6వ తరగతి

(పాఠ్యప్రణాళికా లక్ష్యం-1)
(భాషానైపుణ్యాల అభివృద్ధి)

1. గేయకవుల గురించి తెలుసుకొని, పాఠ్యభాగ కవిని గురించి వివరిస్తారు.
2. అమ్మ ప్రేమను, గొప్పతనాన్ని సొంత మాటల్లో చెప్పగలరు.
3. కథారచయితల గురించి తెలుసుకొని పాఠంలోని రచయిత గురించి వివరించగలరు.
4. స్వాతంత్ర్యం కోసం భారతీయులు పడిన కష్టాలు చెప్పగలరు.
5. అపాయం వచ్చినప్పుడు ఉపాయంతో ఎలా తప్పించుకోవాలో తెలుసుకుంటారు.
6. శతక పద్యాలు వల్లె వేయగలరు అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తారు.

(పాఠ్యప్రణాళికా లక్ష్యం-2)
(సాహిత్య సాంస్కృతిక అభినందన)

1. అమ్మఒడి గేయాన్ని పాడి వివిధ శైలులను గుర్తించి అభినందించగలరు.
2. తృప్తి కథను సొంతమాటల్లో చెప్పి, బావగాడిలోని గుణాన్ని అభినందిస్తారు.
3. గేయాన్ని రాగయుక్తంగా అభినయిస్తూ పాడగలరు.
4. సమయస్ఫూర్తి కథలోని నీతిని గ్రహించి అభినందించగలరు.
5. వివిధ కవుల పద్యాలను భావసహితంగా, శ్రావ్యంగా పాడి అభినందిస్తారు.



(పాఠ్యప్రణాళికా లక్ష్యం-3)
(భాషా నిర్మాణ వినియోగం)

1. అమ్మ / నాన్న/సంరక్షకుల గొప్పతనాన్ని రాయగలరు.
2. కథలోని గుణింతాక్షర పదాలు, వాక్యాలు చదవగలరు, రాయగలరు.
3. గేయం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు, రాయగలరు.
4. కథలోని పాత్రలు-స్వభావం చెప్పగలరు, రాయగలరు.
5. పద్య భావాలను సొంత మాటల్లో చెప్పగలరు, రాయగలరు.

(పాఠ్యప్రణాళికా లక్ష్యం-4)
(సమీక్ష, గ్రంథాలయ వినియోగం)

1. పూర్ణయ్య వంటి వ్యక్తుల వివరాలు సేకరిస్తారు.
2. స్వాతంత్ర్యోద్యమ గీతాలు, పద్యాలు, పాటలు, చిత్రాలు మొదలైనవి సేకరించగలరు.
3. మాదిరిగా ఇచ్చిన కథాసమీక్షను చదివి, దానిని అనుసరించి మరొక కథాసమీక్ష రాయగలరు.

(పాఠ్యప్రణాళికా లక్ష్యం-5)
(భాషా ప్రత్యేకతల అభినందన)

1. అచ్చులు, హల్లులు, వాటిలోని రకాలు గుర్తిస్తారు.
2. గేయంలోని ప్రాసపదాలు గుర్తించి చెప్పగలరు, రాయగలరు.
3. హల్లులలోని రకాలు వాటి వివరాలు తెలుసుకుంటారు.
4. విభక్తి ప్రత్యయాలను సోదాహరణంగా తెలుసుకుంటారు.
5. సంధి నిర్వచనం, ఉత్వ సంధి వివరాలు గ్రహిస్తారు.

APSCERT